


# నేటిధాత్రి®

తెలుగు వార్తా పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం





శనివారం 7-02-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 21 సంచిక : 266 రూ|| 6.00








చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# రెబెల్స్.. డేంజర్ బెల్స్!?




## మున్సిపల్ ఎన్నికలలో పార్టీలకు గుండెదడ?

- రెబెల్స్ ను కూడా పార్టీలు ప్రోత్సహిస్తున్నాయా?
- అన్ని పార్టీల స్థానిక నాయకత్వం చేతులెత్తేసిందా?
- జగిత్యాలలో జీవన్ రెడ్డి రెబెల్స్ తరుపున ప్రచారం చేస్తున్నారు?
- పార్టీ మారిన ఎమ్మెల్యేలున్న చోట కాంగ్రెస్ కు తలనొప్పులు?
- బీఆర్ఎస్ కు రెబెల్స్ బెడద కాస్త తక్కువే?
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రెబెల్స్ చుక్కలు చూపిస్తున్నారు?
- ఉత్తర తెలంగాణాలో బీజేపీ, కాంగ్రెస్ లో ఎక్కువగా రెబెల్స్ రంగంలో వున్నారు?
- రెబెల్స్ గెలిస్తే పరిస్థితిలో మార్పు రాదు?
- రెబెల్స్ మూలంగా బీజేపీ, కాంగ్రెస్ లు ఓడిపోతే మొదటికే మోసం వస్తుంది?
- రాష్ట్ర రాజకీయాల మీద తీవ్ర ప్రభావం పడుతుంది?

హైదరాబాద్, నేటిధాత్రి:

మున్సిపల్ ఎన్నికల్లో చాలా చోట్ల ఆయా పార్టీలకు చెందిన నాయకులు పెద్దఎత్తున రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. అందులో కొంత మంది పార్టీలు బుజ్జగిస్తే విన్నారు. చాలా చోట్ల వినలేదు. పార్టీల మాట లెక్క చేయలేదు. పార్టీలు ప్రకటించిన అభ్యర్థులకంటే రెబెల్సే మరింత ఉత్సాహంగా కనిపిస్తున్నారు. దూకుడుగా రాజకీయం చేస్తున్నారు ప్రచారంలో అసలైన అభ్యర్థులకంటే ముందున్నారు. ప్రజలను కలుస్తున్నారు. ఎందుకంటే రెబెల్స్‌గా పోటీ చేసి పరువ పోగొట్టుకోవడం రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారుతుంది. ఒక వేళ గెలిస్తే పార్టీలో పట్టు దొరుకుతుంది. పార్టీలో గౌరవం పెరుగుతుంది. గుర్తింపు లభిస్తుంది. ఆదిపత్యం చూపించుకునే అవకాశముంటుంది. పోగొట్టుకున్న చోటే వెతుక్కొని లాతభపడ్డట్లుంటుంది. అందుకే తమను తక్కువగా అంచనా వేసిన స్థానిక నాయకుల మీద పై చేయి సాదించినట్లౌవుంది. పార్టీ ఇక భవిష్యత్తులో తనపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఒకటికి రెండు సార్లు ఆలోచించే పరిస్తితి వుంటుంది. రెబెల్‌గా పోటీ చేసి గెలిస్తే ఇన్ని రకాల మర్యాదలు పార్టీలో వుంటాయి. ఇవే కాకుండా ఒక వేళ గెలిస్తే, మెజార్టీ స్థానాలు పొందిన పార్టీకి గెలిచిన రెబెల్స్ అవసరం రావొచ్చు. ఊహించని విదంగా రెబల్స్‌కే పదవులు అందొచ్చు. ఇలా అనేక రకాల రాజకీయ లాభలు వుంటాయి. కొన్ని సార్లు ఇలా రెబెల్స్‌గా గెలిచిన వాళ్లు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు అయిన వాళ్లు కూడా వున్నారు. ఏ అవకాశం ఏ రూపంలో వస్తుందో ఎవరూ ఊహించేది కాదు. వారి వారి పార్టీలు టికెట్లు ఇవ్వకపోవడం కూడా కొన్ని సార్లు అదృష్టాన్ని తీసుకురావొచ్చు. అందుకే పార్టీలో ఎంతో కొంత పేరుండి, ప్రజల్లో పలుకుబడి వున్న వాళ్లు ఇలా రెబెల్స్‌గా పోటీ చేసిన గెలిచిన సందర్భాలు అనేకం వున్నాయి. రాత్రికి రాత్రి పెద్ద పెద్ద నాయకులైన వారు కూడా వున్నారు. అందుకే పార్టీలు పక్కన పెట్టిన వారు ఆత్మాభిమానం చంపుకోలేక రెబెల్స్‌గా పోటీ చేసి గెలుస్తుంటారు. ఈసారి ఆ బెడద అన్ని పార్టీలకు ఎక్కువైందనే చెప్పాలి. అంతే కాకుండా జగిత్యాల జిల్లాలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఏకంగా రెబల్స్‌నే ప్రోత్సహిస్తున్నారు. వారి తరుపున ప్రచారం చేస్తున్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థులను ఓడించాలని చెబుతున్నారు. పదేళ్లుగా పార్టీని పట్టుకొని, నమ్ముకొని వున్న వారిని రెబెల్స్‌గా రంగంలోకి దింపారు. ఇలా గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలా తిరుగుబాటు పెద్ద నాయకులతో కూడా ఎదురైన సందర్భం గతంలో చూడలేదు. కాకపోతే ఈసారి రెబెల్స్ వల్ల పార్టీలకు గుండె దడలు వస్తున్నాయని చెప్పడంలో సందేహం లేదు. ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకున్నది. మున్సిపోల్స్‌లో మునిగేదెదరు? లేలేదెవరు? అనే చర్చ మొదలైంది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దూకుడు కనిపిస్తుందా? లేక కారు దూసుకు పోతుందా? అనే ఉత్కంఠ మొదలైంది. దానికి తోడు కమలం వికసిస్తుందా? అనే మాటలు కూడా అక్కడక్కడా వినిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో పట్టు ఏ పార్టీకి వుంది? అనేది మాత్రం ఎవరికీ అంతు పట్టడం లేదు. సహజంగా పట్టణ ప్రజలు కోరుకునేదేమిటి? అనేది రాజకీయ పార్టీలకు తెలుసు. కాని పట్టణ ప్రజలకు ఈ రెండేళ్ల కాలంలో న్యాయం జరిగిందా? అనేది ఎన్నికలు జరిగి, ఫలితాలు వస్తే గాని తెలియదు. మున్సిపల్ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల ప్రభావం కాంగ్రెస్ మీద పడుతుందా? లేదా అనేది పెద్ద మిస్టరీగా మారింది. జనం కాంగ్రెస్‌ను కూడా ఎక్కడా నిలదీస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. నిజంగా జనంలో ఆక్రోశం వుంటే ఆరుగ్యారెంటీలు ఏవి? అని అడిగేవారేమో! ఇదిలా వుంటే తెలంగాణలో బిఆర్ఎస్ బలం చెక్కు చెదరకుండా వుందా? లేదా అన్నది కూడా ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో తేటతెల్లమౌతుందని చెప్పడంలో సందేహం లేదు. ఎందుకంటే పట్టణ ప్రజలు కొంత వి ద్యావంతమైన సమాజంతో కూడుకొని వుంటుంది. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను అంచనా వేసుకొని ఓట్లు వేస్తారని చెప్పడం అతిశయోక్తి కాదు. ప్రజలు కాంగ్రెస్ పాలనలో సంతోషంగా వున్నారా? లేదా? అన్నది మాత్రం స్పష్టమౌతుంది. అయితే పట్టణ యువత ఎటు వైపు మొగ్గుచూపుతుంది? అనేది కూడా ఆసక్తికరంగా మారింది. ఇటీవల యువత బిజేపి మంత్రం జపిస్తున్నారు. బిజేపి వైపు ఆకర్షితులౌతున్నారు. అదే బిజేపికి కొంత అనుకూలమైన వాతావరణం తీసుకొస్తుందా? అనే చర్చ కూడా జోరుగానే సాగుతోంది. మున్సిపోల్స్‌లో అసలైన ప్రచారం ఊపందుకున్నది. సిఎం. రేవంత్ రెడ్డి రంగ ప్రవేశంతో మొదలైందనే చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే మున్సిపల్ ఎన్నికలు హడావుడిగా నిర్వహించేందుకు యుద్ద ప్రాతిపదికన సన్నాహాలు చేశారు. కాని అన్ని పార్టీలలో ఈ ఎన్నికలపై నాయకులకు ఇంత ఆసక్తి వుందని ముందు ఎవరూ ఊహించలేదు. నిజానికి పంచాయితీ సర్పంచ్ ఎన్నికల మందు కాంగ్రెస్‌లో కూడా పెద్దగా ఊపు కనిపించలేదు. ఓ వైపు ఆరు గ్యారెంటీల ప్రభావం పల్లెల్లో ఎలా వుంటుందో అని అందరూ భయపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు కూడా సర్పంచ్ ఎన్నికల కోరలేదు. ఎప్పుడైతే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ గెల్చుకున్నదో అప్పుడు కాంగ్రెస్‌లో ఆశ మొదలైంది. ఫలితాలు కూడా ఆశాజనంగానే వుంటాయన్న నమ్మకం ఏర్పడింది. దాంతో పంచాయితీ ఎన్నికల ధైర్యం చేశారు. ఊహించినట్లుగానే ఎంతో కొంత మెరుగైన ఫలితాలే సాదించారు. ప్రభుత్వ వ్యతిరేకత పెద్దగా లేదని గమనించారు. అయితే మున్సిపల్ ఎన్నికలకు ఇప్పట్లో వెళ్తారని అనుకోలేదు. పంచాయితీ సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్‌లు కాంగ్రెస్ గెల్చుకున్నది. అదే ఊపులో మున్సిపల్ ఎన్నికల్లో దూకుడు ప్రదర్శించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. అదే సమయంలో కారు పార్టీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఉవ్విల్లూరుతోంది. సర్పంచ్ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద గెలిచే అవకాశం లేదు. కాని మున్సిపల్ ఎన్నికలు మాత్రం పార్టీల గుర్తుతోనే నిర్వహిస్తారు. ఇప్పుడు అసలైన ఆట వుంటుందని బిఆర్ఎస్ అనుకుంటోంది. కాకపోతే రెండు పార్టీలలోనూ రెబల్స్ బెడద మరీ ఎక్కువైపోయింది. గతంలో అవకాశాలు రాలేదని బిఆర్ఎస్‌లో చాలా మంది నాయకులు ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. అదే సమయంలో పదేళ్ల పాటు పార్టీని పట్టుకొని వున్న వాళ్లకు కాకుండా కొత్తగా పార్టీలోకి చేరినవారికి టిక్కెట్లు ఇస్తున్నారని కాంగ్రెస్‌లో కూడా రెబెల్స్ విపరీతంగా పెరిగారు. దాంతో రెండు పార్టీలలో దడ మొదలైంది. అంతే కాదు ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిలో కూడా రెబల్స్ పోటీ చేయడం విశేషం. కరీంనగర్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకన్నా బిజేపి పార్టీ ఎక్కువగా రెబల్స్ బెడదను ఎదుర్కొంటోందని తెలుస్తోంది. ఇలా రెబల్స్ పార్టీల కొంప ముంచుతారా? లేక వాళ్లే గెలిచి పార్టీలకు సవాలుగా మారుతారా? అనే సందేహం వ్యక్తమౌ తోంది. నిన్నటి దాకా రెబల్స్‌ను బుజ్జగించే ప్రయత్నం పార్టీలు బాగానే చేశాయి. అదికార కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుకేసి, మున్సిపల్స్‌లో అవకాశం రాని వారికి నామినెఏటెడ్ పోస్టులు ఇస్తామని కూడా ప్రకటించింది. అందుకు సిఎం. రేవంత్‌రెడ్డి కూడా హామీ ఇచ్చారు. అయినా చాలా చోట్ల కాంగ్రెస్ నాయకులు వెనక్కి తగ్గడం లేదు. ముఖ్యంగా బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో ఈ సమస్య మరింత ఎక్కువగా వుంది. జగిత్యాల జిల్లాలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని దుమ్మెత్తిపోశారు. జగిత్యాలతో టికెట్ల కేటాయింపు తన చేత కాకుండా పార్టీ మారిన సంజయ్‌కి ఎక్కువ టిక్కెట్లు ఇ చ్చారు. దాంతో కాంగ్రెస్ నాయకుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. ఒక దశలో కాంగ్రెస్ నాయకులంతా ఎమ్మెల్యే సంజయ్ ఇంటికి వెళ్లి ఆయనను దూషించారు. పార్టీ మారిన వాళ్లకు టిక్కెట్లు ఇవ్వడాన్ని తప్పు పట్టారు. పార్టీని ఇంత కాలం పట్టుకొని వేళాడిన వారికి అన్యాయం జరుగుతోందని మండి పడ్డారు. అయినా పార్టీ జీవన్ రెడ్డి మాటలు లెక్క చేయలేదు. దాంతో అక్కడ కూడా కాంగ్రెస్ రెబెల్స్ ఎక్కువ మంది బరిలో నిలిచారు. ఇలా పార్టీ మారిన ఎమ్మెల్యేలున్న చోట ఈ వివాదాలు మరింత ముదిరి పాకాన పడ్డాయి. అలాంటి మున్సిపాలిటీలలో గెలుపోటములు ఎలా వుంటాయన్నదానిపై ఆసక్తి నెలకొని వుంది. ఏది ఏమైనా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో రెబెల్స్ కీలక భూమిక పోషిస్తారని చెప్పడంలో సందేహమే లేదు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి







# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం



శనివారం 7-02-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 266 రూ॥ 6.00








చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# రేవంత్‌కు మున్సిపల్ ఎన్నికల పరీక్ష!!




- మహిళా ఓటర్లు మొగ్గు చూపుతారా?
- ఆరు గ్యారంటీలు గట్టెక్కించేనా?
- పార్టీ గెలుపునకు సవాలు విసురుతున్న రెబెల్స్.

## • రెబెల్స్ విషయంలో రేవంత్ సరికొత్త వ్యూహం?

## • పార్టీలో కొనసాగుతన్న రేవంత్ హవా

- అసమ్మతి బెడద లేకపోవడం...రేవంత్‌కు ప్లస్ పాయింట్
- బొగ్గు బ్లాక్ కుంభకోణం ప్రభావం వుండకపోవచ్చు
- అది ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపదు
- భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిలకు ప్రజల్లో సానుకూలత

## • తిట్లను తగ్గించుకుంటే రేవంత్‌కు చాలా ఉపయోగం

## • అధికారాన్ని నిలిపేది సంయమన రాజకీయాలు మాత్రమే!

హైదరాబాద్, నేటిధాత్రి:

ఈనెల 11న తెలంగాణలోని మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగనుండగా వీటిల్లో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు వున్నాయి. మొత్తం వార్డుల సంఖ్య 2996. ఈ పట్టణ స్థానిక సంస్థలకు చెందిన మొత్తం ఓటర్ల సంఖ్య 52.43లక్షలు కాగా, వీరిలోమహిళలు 2680014, పురుషులు 2562369. ఇక ట్రాన్స్‌జండర్ ఓటర్ల సంఖ్య 640. నిజా మాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 వార్డుల్లో అత్యధిక సంఖ్యలో అంటే 348051 ఓటర్లు నమోదవడం విశేషం. మొత్తంమీద చూస్తే మహిళా ఓటర్లే అధికం!

నామినేషన్లకు గడువు తేదీ జనవరి 30వ తేదీనాటికి అన్ని స్థానిక సంస్థలకు కలిపి 28456 నామినేషన్లు దాఖలు కాగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 3వ తేదీనాటికి 6701మంది స్వచ్ఛందంగా తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, వేలాది నామినేషన్లు పొరపాట్లు, ఇతర సాంకేతిక కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యాయి. ఇక స్క్రూటినీలో తొలగించిన, స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్న నామినేషన్ల అనంతరం చివరగా 12993 మంది ఎన్నికల బరిలో మిగిలారు. వీరి భవితవ్యం ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు తర్వాత తేలనుంది.

అధికార పార్టీ తరపున ఈ ఎన్నికల వ్యూహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో వుంచుకొని, ఈసారి పట్టణ 90శాతం సీట్లు పార్టీ గెలుచుకునేలా ఆయన పదునైన వ్యూహాన్ని రచించి, చురుగ్గా అమలు చేస్తున్నారు. ఇందు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేసే పనిలో ఆయన తలమునకలుగా వు న్నారు. ఇందులో భాగంగా మంత్రులు తమ సొంత జిల్లాల్లో వుండి స్థానిక నాయకులతో ఎప్పటి కప్పుడు చర్చలు జరుపుతూ, సమస్యలను పరిష్కరిస్తూ ప్రచారం చురుగ్గా కొనసాగించాలని నిర్దే శించారు. ఇదే సమయంలో ఏరోజుకారోజు ప్రచారం వివరాలు, పరిణామాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి వెల్లడించాలని కూడా ఆయన మంత్రులను ఆదేశించారు. అయితే పార్టీకి తిరు గుబాటు అభ్యర్థుల బెడద తీవ్రంగా వుండటంతో, అటువంటి వారిని బుజ్జగించి నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేయాలని, తర్వాత వీరికి పార్టీ నామినేటెడ్ పదవుల్లో తప్పకుండా అవ కాశం కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని కూడా మంత్రులకు నిర్దేశించారు. జగిత్యాల, గ ద్వాల, మహబూబాబాద్, నర్సంపేట్, జనగాం, కరీంనగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు రెబెల్స్ బెడదతీవ్రంగా వుంది. జగిత్యాలలో మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి, ప్రస్తుత ఎ మ్మెల్యే ఎం. సంజయ్‌కుమార్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొనడం ఇక్కడ రెబె ల్స్ ఎక్కువగా వుండటానికి ప్రధాన కారణం. గద్వాలలో కూడా స్థానిక నాయకుల మధ్య వున్న ఆధిపత్య పోరు రెబెల్స్ నామినేషన్లకు దారితీసింది. ఇటువంటి ప్రాంతాల్లో అధికార, రెబెల్ అభ్యర్థులు పోటీలో కొనసాగే పరిస్థితి ఏర్పడితే ఎవరు గెలిచినా వారిని పార్టీ అభ్యర్థిగా పరిగణించే వ్యూహాన్ని కూడా రేవంత్ అమలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సరిగ్గా ఇటువంటి వ్యూహాన్నే మహానేత వైఎస్ఆర్ తండ్రి రాజారెడ్డి తమ ప్రాంతంలో అమలు చేసేవారని చెబుతారు. ఈ వ్యూహం ఫలిస్తే రెబల్స్ బెడద తీవ్రత చాలావరకు పరిష్కరించడమే కాదు, ప్రచారంలో తాము ముందు రూపొందించుకున్న వ్యూహం ప్రకారం ముందుకెళ్లడానికి ఎటువంటి ఇబ్బంది వుండదు. ఇదే సమయంలో ఆయా వార్డుల్లో నిక్కచ్చి సర్వే ఫలితాల ఆధారంగా అభ్యర్థు లను ఎంపిక చేయడం రేవంత్ అనుసరించిన మరో వ్యూహం. అంటే గెలుపు గుర్రాలకే టిక్కె ట్లు దక్కడం పార్టీ విజయావకాశాలను పెంచుతుంది. గతంలో సర్వేలకంటే సిఫారసులకే కాంగ్రెస్‌లో విపరీత ప్రాధాన్యం ఇవ్వడంవల్ల నిండా మునగడం అనేది సర్వసాధారణంగా మారిన క్రమంలో రేవంత్ అభ్యర్థుల ఎంపికకు కచ్చితమైన పరిష్కారాన్ని అనుసరించినట్లయింది. వీటికి తోడు రేవంత్‌రెడ్డి ఈనెల 4 నుంచి 9వరకు మిర్యాలగూడ, నిజామాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గననున్నారు. ఈవిధంగా అవసరమని భావించిన చోట్ల ఆయనతన శైలి ప్రచార కార్యక్రమ వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. అయితే పార్టీ ఏఐఎంఐఎంతో ఎటువంటి పొత్తులు పెట్టుకున్నట్టు ప్రకటించనప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో స్థానిక అవసరాల రీత్యా సీపీఐ, సీపీఎం, తెలంగాణ జన సేన పార్టీలతో ఒక అవగాహనకు రావడం గమనార్హం. అన్నింటికంటే ముఖ్య విషయమేమంటే పార్టీ అనుసరిస్తున్న విధానం ప్రకారం 42శాతం సీట్లలో బీసీలకు ప్రాధాన్యత నివ్వడం రేవంత్ అనుసరించిన కీలక వ్యూహం.

ఈవిధంగా పార్టీపరంగా అర్థవంతమైన వ్యూహంతో రేవంత్‌రెడ్డి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకెళ్లడం, విపక్ష బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బకొట్టే లక్ష్యంతో కొనసాగుతోంది. ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు సంక్షేమ పథకాలను ప్రధానంగా హైలైట్ చేసుకుంటూ రేవంత్ ప్రచారం కొనసాగనున్నది. విశేషమేమంటే, కాంగ్రెస్‌లో గతంలో మాదిరిగా అంతర్గత విభేదాల రచ్చ బయటకు కనిపించడంలేదు. రేవంత్ ఏకఛత్రాధిపత్యంగా పార్టీని నడిపిస్తుండటమే కారణం. అదీ కాకుండా ఛరిష్మా విషయంలో రేవంత్‌ను ఢీకొట్టే నాయకుడు లేకపోవడం ఇప్పుడు ఆయనకు కలిసొచ్చిన అంశం. ఎవరూ సంప్రదాయ శైలిలో అసమ్మతి రాజకీయాలు నెరపడం ఇప్పుడు సాధ్యం కాదు. ఆవిధంగా చేస్తే పార్టీ నిండా మునుగుతుందన్న వివేచన కూడా సీనియర్ కాంగ్రెస్ నేతలను మౌనంగా వుండేలా చేస్తున్నది. ప్రతి మంత్రి రేవంత్‌ను కేంద్రంగా చేసుకొని అభివృద్ధి పనుల్లో పాల్గోనడం, విపక్షాలను ఎదుర్కొనడంలో ఒక పద్ధతిని అనుసరించడం ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న సరికొత్త దృశ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే పార్టీలో ఇప్పుడు రేవంత్ వన్ మ్యాన్ షో కొనసాగుతున్నది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ వరుస పరాజయాలు ఎదుర్కొంటున్న దశలో తెలంగాణలో పార్టీని నిలబెడుతున్న రేవంత్‌కు మాత్రమే అధిష్ఠానం అండ వుంటోంది. ఒకప్పటి కాంగ్రెస్‌లో ఇందిర, రాజీవ్ వంటి జాతీయస్థాయి ఛరిష్మా కలిగిన నాయకుల ఆధ్వర్యంలో పార్టీ నడిచేది కనుక, రాష్ట్రాల్లో అసమ్మతి రాజకీయాలు నిరంతరం కొనసాగే వి. కేంద్ర నాయకత్వం తమ పట్టుకోసం ఇటువంటి అసమ్మతి రాజకీయాలను ప్రోత్స హించేది. కానీ ఇప్పుడు తెలంగాణలో ఇది సాధ్యంకాదు. రేవంత్‌కు ప్రత్యామ్నాయ నాయకుడు పార్టీలో ఇప్పుడు లేరు! ఇదే పరిస్థితి గతంలో వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడువుండేది. మహిళల ఓట్లు అత్యధికంగా సాధిస్తే గెలుపు తథ్యమన్న సంగతి తేలిపోయింది. ఎందుకంటే ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న స్థానిక సంస్థల్లో మహిళా ఓటర్లే అధికం. పురుష ఓటర్లుతగ్గడం గమనార్హం. మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై రేవంత్ నేతృత్వంలోని మంత్రులు, నాయకులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి ప్రచారం చేస్తే తప్పక ఫలితం వుండగలదనిఒక అంచనా. ఆరు గ్యారంటీలు, అమలు చేయని ఇతర పథకాల ప్రస్తావనను అవసరమైన చోట్ల మాత్రమే తీసుకొస్తూ, మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యతను హైలైట్ చేయడం పార్టీకి ఉపయోపడే అవకాశాలున్నాయి. ఎంత చేసినా, చేయకపోయినా విపక్షాల విమర్శలు ఎట్లాగూ వుంటాయి కనుక, కోల్ బ్లాక్ కేటాయింపు విషయంలో జరిగిన రాజకీయ రచ్చ ప్రభావం ఇప్పటి ఎన్నికల్లో వుండకపోవచ్చు. ఎం దుకంటే ఈ సమస్య ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపదు. అందువల్ల ఆ అంశాన్ని వారు పట్టించుకునే అవకాశాలు చాలా తక్కువ. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మధ్య విభేదాలున్నాయన్న ప్రచారం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట దెబ్బతీయడానికివిపక్షాలు యత్నించినా, ఈ ఇద్దరు నాయకులు తమ జిల్లాలకు పరిమితం కావడం, ఎటువంటి అవినీతి ఆరోపణలు వున్నవారు కాకపోవడం పార్టీకి కలిసొచ్చింది. అందువల్లనే ఎంత రచ్చ చేసినా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లలేదు. కాకపోతే ఈ రచ్చలో ఐఎఎస్ అధికారిణి, ముగ్గురు జర్నలిస్టులు బలయ్యారు. అయితే బీఆర్ఎస్‌కు సానుకూలతను కల్పించి, కాంగ్రెస్‌కు మైనస్ పాయింట్‌గా మారేది మాత్రం టెలిఫోన్ ట్యాపింగ్‌పై కొనసాగుతున్న సిట్ విచారణ! ఈ విషయంలో ప్రభుత్వం తప్పటడుగు వేస్తున్నదనే చెప్పాలి. ఈ విచారణ ద్వారా సాధించేది ఏమీ వుండదనేది సుస్పష్టం. కాకపోతే ఇక్కడ బీఆర్ఎస్ నాయకులపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం ఆ పార్టీకి అనుకూలంగా మారే అవకాశాలున్నాయి. ఎందుకంటే మనదేశంలో సెంటిమెంట్ అధికం. కేసీఆర్ వయసు రీత్యా అటువంటి సెంటిమెంట్ ప్రజల్లో నాటుకుంటే కాంగ్రెస్ కొంప కొల్లేరు కావడం ఖాయం. అందువల్ల ఈ "విక్రమ్ ఔర్ భేతాళ్" విచారణకు ముగింపు పలకడం కాంగ్రెస్‌కు ముఖ్యంగా రేవంత్‌కు శ్రేయస్కరం. అధికారంలో వున్నప్పుడు కేసీఆర్ చేసిన తప్పిదాలకు ప్రతీకారానికి పోకుండా వుంటేనే రేవంత్‌కు సానుకూలత వుంటుంది. ప్రతీకారమనేది రాచపుండు లాంటిది. రేపిన కొద్దీ అది మరింత పెరుగుతుందే తప్ప తగ్గదు! అదీకాకుండా అధికారంలో వున్నవారు సంయమనంతో వుండటం చాలా అవసరం. విపక్షాలు దూకుడుగా ఏ విమర్శలు చేసి నా వాటికి వచ్చే లాభం లేదా నష్టం ఏమీ లేదు. అధికారంలో వున్నవారు అద్దాల మేడలో వున్నచందంగా పరిస్థితి వుంటుంది. ఎవరు రాయి విసిరినా ముక్కలయ్యేది వీరు నివసించే భవనం అద్దాలు మాత్రమే! అంటే ముఖ్యమంత్రి ఎంత సహనంగా వుండి, జాగ్రత్తగా ముందుకు అడుగులువేస్తే అంత శ్రేయస్కరం. ఇదే ఆయన్ను రాజకీయంగా బలోపేతం చేస్తుంది. ఇప్పుడు జరుగబో యే మున్సిపల్ ఎన్నికల్లో గణనీయ విజయాలు సాధిస్తే ఇక ముందు రేవంత్ రాజకీయ భవిత వ్యానికి ఎటువంటి ఢోకా వుండదు. ఇక్కడ రేవంత్‌కు కలిసొచ్చే మరో అంశమేమంటే, పార్టీలో ఆత్మహత్యా రాజకీయాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేకపోవడం!




"నేటిధాత్రి" 21వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "20 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను వింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ "21 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ, నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ, నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999



నిజాయితీయైన వార్తల నిజరూపం

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం



## న్యాయవాదులకు ఆహ్వానం

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలో 21 సంవత్సరాల అనుభవం కలిగిన "నేటిధాత్రి" పత్రికలో "లీగల్ టీం" లో చేరడానికి జిల్లాల వారీగా ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన ఆశావాహులైన న్యాయవాదులకు ఆహ్వానం.

ఆసక్తి కలిగిన న్యాయవాదులు బయోడేటాను కింది నెంబర్లకు వాట్సఅప్ ద్వారా పంపించగలరు.

"నేటిధాత్రి" కార్యాలయము. రోడ్ నెం. 3, బంజరహిల్స్,హైదరాబాద్

9908658888, 9989138678, 6281849354



శనివారం 7-02-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 21 సంచిక : 266 రూ॥ 6.00






## రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

### రేవంత్ అభ్యర్థనకు హైకోర్టు తిరస్కరణ

హైదరాబాద్, నేటిధాత్రి:

హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.





# భూములపై రైతులకే హక్కులు కల్పించాం

- ట్యాంపరింగ్ చేయకుండా రికార్డులన్నీ భద్రం
- క్యూ ఆర్ కోడ్‌తో వివరాలు చూసుకునే వీలు
- లంచాల వ్యవస్థకు చరమగీతం పాడేలా భూ హక్కు పత్రాలు
- ఎవరు ట్యాంపర్ చేసినా జైలుకు పంపిస్తాం
- కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు

కర్నూలు, నేటిధాత్రి:

భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం అని చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు.

జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను


05 లో










# కారు గుర్తుకు ఓటేస్తేనే రేవంత్ రెడ్డికి గూబ గుయ్యి అంటుంది

- పక్క రాష్ట్రంలో చంద్రబాబు రూ. 4000 ఇస్తున్నారు.. ఇక్కడ రేవంత్ రెడ్డికి చేతులు రావడం లేదు.
- అక్కాచెల్లెళ్లకు రూ. 60,000 బాకీ పడ్డ కాంగ్రెస్ సర్కార్.
- ఐదు పంటల్లో మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టిన ఘనుడు రేవంత్.
- దేవుడి మీద ఒట్టు వేసి రైతులను మోసం చేసిన పాపాత్ముడు.
- జిన్నారం ప్రజలపై పన్నుల భారం మోపడానికే మున్సిపాలిటీ చేశారు
- మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు

పటాన్‌చెరువు, జిన్నారం :

పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు పర్యటించారు. జిన్నారం గ్రామ వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. జిన్నారం గ్రామం పంచాయతీగానే కొనసాగాలని బీఆర్ఎస్ ప్రభుత్వం కోరిందని, మున్సిపాలిటీ అయితే ప్రజలపై పన్నుల భారం పడుతుందని అప్పట్లోనే అడ్డుకున్నామని హరీష్ రావు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిన్నారాన్ని మున్సిపాలిటీగా మార్చి ప్రజలపై పన్నుల భారాన్ని మోపిందని ఆరోపించారు.

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పెన్షన్‌ను రూ. 200 నుంచి రూ. 2000కి పెంచి మాట నిలబెట్టారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి మాత్రం రూ. 4000 పెన్షన్ ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని విమర్శించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లే రూ. 4000 పెన్షన్ ఇస్తున్నారని, మరి తెలంగాణలో ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు.

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు రూ. 60,000 బాకీ ఉందని తెలిపారు. కేసీఆర్ పాలనలో బతుకమ్మ పండుగకు ప్రతి మహిళకు చీర ఇచ్చేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చీరలు లేవు, గాజులు లేవని విమర్శించారు.

ఫ్రీ బస్సు పథకం పేరుతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సీట్లు దొరకక తిప్పలు పడుతున్నారని చెప్పారు. రైతుబంధు విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, ఐదు పంటలు వస్తే రెండింటికే సాయం చేసి మిగిలిన వాటిని ఎగ్గొట్టిందని ఆరోపించారు.

దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏ ఊరిలో చూసినా సగం మందికే రుణమాఫీ జరిగిందని తెలిపారు.

ఈ మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తేనే రేవంత్ రెడ్డికి గట్టి సందేశం వెళ్తుందని అన్నారు. ఓటుకు డబ్బులు ఇస్తామని చెప్పి మోసం చేస్తున్నారని, వాటిని తీసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు.

మైనార్టీలకు అండగా నిలిచింది, షాదీ ముబారక్ వంటి పథకాలు అమలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని హరీష్ రావు పిలుపునిచ్చారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..

### స్పీకర్‌కు మరో 3 వారాలు గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు



హైదరాబాద్, నేటిధాత్రి:

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం


12 లో


## ప్రజలే మిమ్ములను వద్దనుకున్నారు

- ఇప్పుడు న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటారా
- ప్రశాంత్ కిశోర్‌కు చీఫ్ జస్టిస్ చురకలు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:

ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని


12 లో


## రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి..

### తెలంగాణ ప్రజలకు, గులాబీ సైనికులకు కేటీఆర్ సూచన



హైదరాబాదం, నేటిధాత్రి:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల వేళ తమ ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై, ఆయన వ్యక్తిత్వం మీద రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి అని


05 లో


## మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న
- తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్, నేటిధాత్రి:

మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.


05 లో




# ఘాటెక్కిన మిర్చి ధర



- వండర్‌హాట్ రకం మిర్చికి క్వింటాల్‌కు రూ. 38వేలు
- ఏనుమాముల మార్కెట్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ధరలు



వరంగల్, నేటిధాత్రి:

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు ఘాటెక్కుతున్నాయి. గత రికార్డులను బ్రేక్ చేస్తూ గురువారం వండర్‌హాట్ రకం మిర్చి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 38వేల ధర పలికి రికార్డు సృష్టించింది. ఏనుమాముల మార్కెట్‌కు మిర్చి రాబడులు గణనీయంగా తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కాగా, బుధవారం వండర్‌హాట్ మిర్చి రూ. 37,100 ధర పలికి ఆల్‌టైం రికార్డు సృష్టించగా, ఒక్క రోజు వ్యవధిలోనే రూ. 900 పెరిగి రూ. 38వేలు పలకడం విశేషం.

వరుసగా రెండు రోజుల నుంచి మిర్చి ధరలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వండర్‌హాట్, 341 రకాలను సాగు చేసిన రైతులకు మంచి లాభాలు వస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే యూఎస్ 341 రకం మిర్చికి రూ. 26,700, దీపిక రకం మిర్చికి రూ. 27వేలు, తేజ రకం మిర్చికి రూ. 19,500, పత్తికి రూ. 7,630, మినుములకు రూ. 8,602, పెసర్లకు రూ. 8,352 గరిష్ఠంగా ధరలు పలికాయి.

స్వల్పంగా పడిపోయిన పత్తి ధరలు

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. బుధవారం రూ. 7,700 ఉండగా ఒక్క రోజులో క్వింటాల్‌కు రూ. 70 తగ్గి రూ. 7,630కి పడిపోయింది. దీంతో ధరలో స్వల్ప తగ్గుదల చోటు చేసుకుంది.



# సిట్ విచారణ తర్వాత కేసీఆర్‌లో ఆత్మవిశ్వాసం



## తొలిసారి మీడియాకు అన్ని అంశాలపై వివరణ



## కాంగ్రెస్ కంటే రేవంత్‌నే టార్గెట్ చేసుకున్న బీఆర్ఎస్

- పచ్చమీడియా అండతో కేసీఆర్‌పై దూకుడు పెంచిన రేవంత్
- మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్,బీఆర్ఎస్‌ల మధ్య పోరాటం
- మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్‌కు అనుకూలమైతే రేవంత్‌కు కష్టం
- కాంగ్రెస్ బాగా పుంజుకుంటే బీఆర్ఎస్‌పై రేవంత్ ఉక్కుపాదం
- ఒకవేళ కేసీఆర్ లేదా కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే రణరంగంగా రాష్ట్రం


**హైదరాబాద్, నేటిధాత్రి:**
కేసీఆర్‌ను సిట్ విచారించిన తర్వాత అనుకున్న విధంగానే తెలంగాణ రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అంతకుముందు హరీష్‌రావు, కేటీఆర్‌లను సిట్ విచారణకు పిలిచినప్పుడే కొంత గందరగోళం ఏర్పడింది. ఇప్పుడు ఏకంగా కేసీఆర్‌నే ప్రశ్నించడానికి పిలవడటం బీఆర్ఎస్ నాయకులకు ఎంతమాత్రం మింగుడుపడటంలేదు. ఇదిలావుండగా రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారాన్ని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డికి అందజేసిన సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ చేసిన వ్యాఖ్యలతో గులాబీ దళంలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రావి నారాయణరెడ్డి సర్వం త్యాగం చేసిన గొప్ప నాయకుడు. ఆయన నిబద్ధ రాజకీయాలు, సైద్ధాంతిక నిబద్ధత అన్ని కాలాల్లో చిరస్మరణీయమనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. అయితే తెలంగాణ పేరు చెప్పి వేలకోట్లు సంపాదించినవారు జాతిపిత ఎట్లా అవుతారని ఆయన ప్రశ్నించడం ఇప్పుడు తెలంగాణలో రాజకీయ గందరగోళానికి కారణం. నాటి రాజకీయ నిబద్ధత వేరు, నేటి రాజకీయ అవసరం, పరిణామ క్రమం వేరన్న సంగతి ఇక్కడ గుర్తుంచుకోవాలి. సర్వం త్యాగం చేసిన నాటి నాయకులు తమ నిబద్ధత ఆధారంగా సమాజంపై తమదంటూ ఒక బలీయమైన ముద్రను వేసారు. నాటి కాలమాన పరిస్థితులు అటువంటివి. కానీ నేడు అంతటి నిబద్ధత ప్రదర్శించే నాయకులను రాజకీయాల్లోకే రానీయకపోగా, అవసరానికి కర్వేపాకులా వాడుకొని వదిలేసే దౌర్భాగ్య రాజకీయాలు నడిచే కాలమిది. నాటి కాలానికి అటువంటి త్యాగశీల నాయకులుండటం వల్లనే తెలంగాణ విముక్తి సాధ్యమైంది. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాటి నిబద్ధత నేడు పనిచేయదు, నేటి రాజకీయ వ్యాపారం నాడు లేదు...అంతటి డబ్బు కూడా నాడు చలామణిలో వుండేది కాదు.

దీన్ని అట్లావుంచితే ప్రస్తుతం తప్పు చేసినవారు శిక్ష అనుభవించకతప్పదనేది రేవంత్ చెబుతున్న మాట. కరక్టే! ఇందులో ఎటువంటి సందేహం లేదు. కానీ ఫోన్ ట్యాపింగే అధికారంలోని రాజకీయ పార్టీకి సంబంధం లేనప్పుడు ఇక్కడ తప్పు జరిగిందన్న ప్రశ్నే లేదన్నది బీఆర్ఎస్ వాదన. అది ప్రభుత్వ విధానాల్లో ఒక భాగం కనుక పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఇంటెలిజెన్స్ విభాగం సమాచారం సేకరించి ముఖ్యమంత్రికి నివేదించడం తప్పనిసరి అన్నది కేసీఆర్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నదాంట్లో నిజముంది. కాకపోతే ఈ విధానాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందన్న ఆరోపణపై సిట్ విచారణ కొనసాగుతోంది. ఈ విచారణ ఎంతగా సాగదీసినా అధికారంలో వున్న ఏ ప్రభుత్వమైనా సాధించేదేమీ వుండదు. కేవలం ప్రచారం పొందడం, ప్రత్యర్థులను దోషులుగా చిత్రీకరించడం తప్ప! ఇది అధికార కాంగ్రెస్‌కే కాదు, బీఆర్ఎస్‌కూ వర్తిస్తుంది.

ఈనెల 1వ తేదీన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఐదు గంటలపాటు విచారించింది. కక్షసాధింపు చర్యల్లో భాగంగా దీన్ని ఒకప్పటి దూరదర్శన్ సీరియల్ “విక్రమ్ ఔర్ భేతాళ్” మాదిరిగా రేవంత్ ప్రభుత్వం నడుపుతోందన్నది బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ. ఎటూ తేలని ఈ సాగదీత విచారణపై తెలంగాణ ప్రజల్లో కూడా ఇదే రకమైన అభిప్రాయం ఏర్పడే అవకాశముంది. అటువంటి అభిప్రాయం ఏర్పరచడానికి బీఆర్ఎస్ చేయాల్సిందంతా చేస్తుంది కూడా! నిజం చెప్పాలంటే రెండేళ్లక్రితం కేసీఆర్ మీద ప్రజల్లో వున్న వ్యతిరేకత ఇప్పుడు కచ్చితంగా తగ్గింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది రేవంత్ ఛరిష్మాకంటే, కేసీఆర్‌మీద వున్న వ్యతిరేకతే ప్రధాన కారణం! అందువల్ల ఈ వ్యతిరేకత తీవ్రత తగ్గిందంటే కాంగ్రెస్‌కు ఇబ్బందులు ఖాయం! తనమీద వ్యతిరేకత క్రమంగా తగ్గుతున్నదన్న సంగతినిపసిగట్టడం వల్లనే విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన కేసీఆర్‌లో ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది. ఆయన తన పూర్వశైలిని ప్రదర్శించడమే ఇందుకు తార్కాణం. ఇదే సమయంలో తన ప్రభుత్వంపై గతంలో వచ్చిన అపోహలను తొలగించడానికి ఆయన ప్రయత్నించారు. తనపై తీ వ్ర ప్రతికూలత వున్నప్పుడు ఏం చెప్పినా, కేవలం సమర్థించుకోవడానికి, తప్పు కప్పిపుచ్చుకోవ డానికి చెప్పారంటారు. కానీ పార్టీ ఓటమి తర్వాత కేసీఆర్ ఇప్పటివరకు ఇంతటి వివరణాత్మక మీడియా సమావేశం ఎప్పుడూ పెట్టలేదు. పరిశీలిస్తే కేటీఆర్, హరీష్‌రావు లేదా మరే ఇతర బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను టార్గెట్ చేసేదానికంటే, కేవలం రేవంత్‌పైనే తమ దృష్టినంతా కేంద్రీకరిస్తున్నారు. రేవంత్ కూడా కేసీఆర్ ఇమేజ్‌ను ప్రజల మనోఫలకాలనుంచి తొలగించడానికి శతథా ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడంలే దు. ఎందుకంటే తెలంగాణ ప్రజల్లో భావోద్వేగం ఎక్కువ. అంతేకాని ఆంధ్రలో మాదిరిగా అవసరాన్ని బట్టి అభిప్రాయాన్ని మార్చుకోవడం వుండదు. ఇప్పటివరకు నడిచిన ప్రతికూల కాలంలో తగ్గివున్న కేసీఆర్ ఇప్పుడు సమయ సానుకూలతను పసిగట్టి దీన్ని పూర్తిస్థాయికి తీసుకెళ్లడానికి సమావేశాలతో కూడిన ఒక కార్యాచరణను ప్రకటించారు. మారిన పరిస్థితుల్లో తెలంగాణలో ఇప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అనేదానికంటే, కేసీఆర్ వర్సెస్ రేవంత్ అనడం సముచితంగా వుంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ సీనియర్ నేతలను క్రమంగా తెరవెనక్కు నెట్టేస్తున్నాయి. రేవంత్ “కాంతి”లో వీరు వెలగాల్సిందే తప్ప, స్వయం ప్రకాశం లేదు! అయితే రేవంత్ మాత్రం కేసీఆర్‌పై విమర్శల దాడులు ముమ్మరం చేశారు. తనను తాను ఒక బాధితుడిగా చెప్పుకోవడానికి కేసీఆర్ ప్రయత్నించకుండా,ఓటమిని అంగీకరించి, విచారణను ఎదుర్కొనాలని రేవంత్ కోరుతు న్నారు. మరిప్పటివరకు జరిగింది విచారణే కదా! కానీ కేసీఆర్‌పై విచారణ జరపడం అదీ మున్సిపల్ ఎన్నికలు మరో పదిరోజులున్న తరుణంలో చేస్తున్న ఈ తంతంగం కాంగ్రెస్‌కు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. అసలిప్పుడు కాంగ్రెస్ కనుమరుగై, రేవంత్ మాత్రమే కనిపిస్తు న్నారు. ఆయనకు అండగా పచ్చమీడియా మరింత బహిరం గంగా నిలబడటాన్ని కేసీఆర్ కచ్చితంగా తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొ ట్టేందుకు ఉపయో గించుకోవడం ఖాయం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో, తెలంగాణ ఆవిర్భావం దుస్సాధ్యమన్న అభిప్రాయం బలంగా వున్న కాలంలోనే కేసీఆర్, చిమ్మ చీకటిలో ఎవరూ తోడురాని స్థితిలో ఒంటరిగా గుడ్డి లాంతరు చేతబూని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన నాయకత్వ పటిమ ఆయనది. అంతటి కఠిన పరిస్థితులను ఎదుర్కొన్న అపార అనుభవం ముందు ప్రస్తుత ప్రతికూలతను ఆయన అంతపెద్ద ఇబ్బందిగా పరిగణించబోరు. కాకపోతే ఇప్పటివరకు తనపట్ల ప్రజల్లో వున్న వ్యతిరేకత తీవ్రత తగ్గేవరకు వేచివుండి, ఇప్పుడు తన వాదనను స్పష్టంగా వినిపించే అవకాశం వచ్చిందన్న భావన ఆయన నిన్న మీడియాతో మాట్లాడిన మాటల తీరులో వెల్లడైంది.

ఇదే సమయంలో రేవంత్ చేసే ప్రతి విమర్శను సమర్థవంతంగా ఎదుర్కొనడంలో కేటీఆర్, హరీష్‌రావులు చూపుతున్న చురుకుదనం మరింత పదును సంతరించుకోవడం గమనార్హం. ఇదిలా వుండగా టెలిఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఇప్పటికే నలుగురు పోలీసు అధికార్లను అరెస్ట్‌చేసిన నేపథ్యంలో, వారిచ్చిన సమాచారం ఆధారంగా రాబోయే కాలంలో కేసీఆర్ లేదా కేటీఆర్‌లను అరెస్ట్ చేయడానికి నిర్ణయిస్తే, రాష్ట్రంలో పెద్దఎత్తున రాజ్యాంగ సంక్షోభం ఏర్పడే అవకాశంలేకపోలేదు. అయితే మరో పదిరోజుల్లో జరగబోతున్న మున్సిపల్ ఎన్నికల్లో ఈ సిట్ విచారణనుకాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమకు అనుకూలంగా మలచుకోవడానికి తీవ్రంగా యత్నిస్తున్నాయి. కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టడానికి రేవంత్‌కు ఆంధ్ర మీడియా అండగా నిలబడిన నేపథ్యంలో, తెలంగాణ సాధించడానికి చావునోట్లో తలబెట్టిన తనను రాజకీయంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నఅంశాన్ని, జలవివాదాలపై రేవంత్ ఆంధ్రకు అనుకూలంగా వ్యవహరిస్తు న్నారన్న సంగతిని కేసీఆర్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి సెంటి మెంట్‌ను ఎగదోసే అవకాశాలే అధికం. ఈ పరస్పర రాజకీయ చదరంగంలో ఒకవేళ బీఆర్ఎస్ ఆధిపత్యం సాధిం చి ఎక్కువ మున్సిపల్ స్థానాలను చేజి క్కించుకుంటే, రేవంత్‌కు కష్టాలు తప్పవు. బీఆర్ఎస్ పుంజుకోకపోయినా, గతం కంటే పట్టుకోల్పోయినా, కేసీఆర్ లేదా కేటీఆర్ అరెస్ట్‌లు తప్పవనుకోవాలి. ఆవిధంగా ప్రత్యర్థి బలహీనంగా వున్నప్పుడే నిర్వీర్యం చేయాలన్న ‘చంద్రబాబు’ వ్యూహాన్ని రేవంత్ అమలు చేయవచ్చు. ఈ రెండు అంశాల్లో ఏది జరిగినా ఇప్పటివరకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను విమర్శిస్తున్న బీజేపీ తానే ప్రత్యామ్నాయ ప్రతిపక్షమన్న బ్రాండ్‌ను ఏర్పరచుకోవడానికి తప్పక ప్రయత్నిస్తుంది. ఇప్పుడు మున్సిప ల్ ఎన్నికలు రేవంత్ సుస్థిర తకు, కేసీఆర్ తిరిగి తన స్థానాన్ని నిలుపుకునేందుకు జరిపే పోరాటానికి ఒక గీటురాయిగా పరిగణించాల్సి వస్తున్నది. ఒకరకంగా రాజకీయంగా ఇది “చావో-రేవో”అనే పరిస్థితి రేవంత్, కేసీఆర్‌లకు ఏర్పడగా, మిగిలిన కాంగ్రెస్ సీనియర్ నేతలకు స్వయం ప్రకాశంలేని ఈ పదవుల్లో కొనసాగినా లేక ప్రతిపక్షంలో వున్నా వుండేది, పోయేది ఏమీ లేదు.







# భూములపై రైతులకే హక్కులు కల్పించాం

- ట్యాంపరింగ్ చేయకుండా రికార్డులన్నీ భద్రం
- క్యూ ఆర్ కోడ్‌తో వివరాలు చూసుకునే వీలు
- లంచాల వ్యవస్థకు చరమగీతం పాడేలా భూ హక్కు పత్రాలు
- ఎవరు ట్యాంపర్ చేసినా జైలుకు పంపిస్తాం
- కలుగొట్లలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు

కర్నూలు, నేటిధాత్రి:
భూమిపై ఇతరులెవరూ కన్నేయకుండా ప్రజలకు సర్వహక్కులు కల్పించామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో భూ సమస్యల ఫిర్యాదులు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇప్పుడు భూమిని ఇతరుల పేరుపైకి మారిస్తే వెంటనే తెలుస్తుంది. క్యూఆర్ కోడ్‌తో మీ ఫోన్‌లోనే మీరు చూసుకోవచ్చు. మీ రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రంగా ఉంటాయి. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం అని చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్లలో స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో



'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజముద్రతో పట్టాదారు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. వీటిని ఎవరైనా ట్యాంపర్ చేస్తే నేరుగా జైలుకే పంపిస్తాం. అలాంటి వారిని వదిలిపెట్టేది లేదు.
జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు
నాయుడు తెలిపారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు.
మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రతనాల సీమ అయిన రాయలసీమ రాళ్ల సీమగా మారిందని.. అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు - నగరి ప్రాజెక్టులు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురంను ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని చెప్పారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు. గోదావరి పట్టిసీమ పెట్టి.. కృష్ణా డెల్టాకు ఇచ్చే100 టీఎంసీల నీరు రాయలసీమకు మళ్లించి ఆ ప్రాంతంలో కరువును తొలగించామన్నారు.
కరువు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. నగదు కోసం.. కమీషన్‌లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర (టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ తీవ్రవాదులు ఉండే సమయంలో.. ఆ నగరాన్ని తాను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. వారికి తాను అడ్డు తగులుతున్నానని తిరుపతిలో తనపై దాడికి దిగారని.. కానీ ఆ వెంకటేశ్వర స్వామి తనను కాపాడారన్నారు. బల ప్రదర్శన అనేది ఎన్నికలలో చూపించుకోవాలని.. మిగతా సమయంలో ప్రజా సేవ చేయాలన్నారు. రాజకీయాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాట తీస్తానని వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా తాను ఉన్నానని.. కాబట్టే ఇప్పుడు హైదరాబాద్ ,సైబరాబాద్ నగరాలు ఉన్నాయని తెలిపారు. తాను చిత్రగుప్తుడిలా అన్ని రాసుకుంటూ ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిని కూడా కల్తీ చేశారు. సీబీఐ, సిట్ ఏమీ లేదని చెప్పారని అంటున్నారు. అందులో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ నివేదిక వెల్లడించింది. బాత్‌రూమ్ క్లీన్ చేసే రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా చేశారు. శ్రీశైలంలో కూడా రసాయనాలతో ప్రసాదం కల్తీ చేశారు. నేను సీఎం అయ్యాక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించాం. తితిదే ఈవోను మార్చి మంచి ఆఫీసర్‌ను తీసుకొచ్చాం. గతంతో పోలిస్తే లడ్డూలో చాలా వ్యత్యాసం ఉందని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఫరూక్, టిజి భరత్ తదితరులు పాల్గొన్నారు.



# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న
- తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, నేటిధాత్రి:
మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.
ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.



# ఏడుపాయలలో శివరాత్రి జాతర

## 15 నుంచి 17 వరకు నిర్వహణ

మెదక్, నేటిధాత్రి:
అత్యంత వైభవంగా జరిగే రెండో అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గా భవాని మాత మహాజాతరకు ముహూర్తం ఖరారైంది. ఏడు పాయల మధ్య వెలిసిన ఆ వనదుర్గమ్మ కు శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహిస్తారు. ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం , ఆలయ కమిటీ సర్వ సిద్ధం చేస్తోంది. మంజీరా నది ఏడు పాయలుగా విడిపోయి, అమ్మవారి పాదాల చెంత నుంచి ప్రవహించే ఈ పవిత్ర క్షేత్రానికి ఏటా కోట్లాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరలో భాగంగా మొదటి రోజు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకోనున్నారు. రెండో రోజైన ఫిబ్రవరి 16న జాతరలోనే ప్రధాన ఘట్టమైన 'బండ్ల ఉత్సవం' అత్యంత కోలాహలంగా సాగుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్లబండ్లను రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదర్శనగా తిరుగుతూ మొక్కులు తీర్చుకుంటారు. ఆఖరి రోజైన ఫిబ్రవరి 17న రథోత్సవంతో ఈ మహా క్రతువు ముగుస్తుంది. ఈ జాతరకు కేవలం మెదక్ జిల్లా నుంచే కాకుండా సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ , పొరుగు రాష్టాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుండి కూడా సుమారు 15 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా



, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా సౌకర్యం కోసం తెలంగాణ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులను నడపనుంది. భక్తుల భద్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, భారీ పోలీస్ బందోబస్తును కూడా మోహరిస్తున్నారు. వనదుర్గమ్మ ఆశీస్సుల కోసం వచ్చే భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# బాలలను ఇటుక బట్టి పనుల్లో పెట్టుకోవద్దు



వరంగల్ , నేటిధాత్రి:
ఇటుక బట్టీలలో 18 సంవత్సరాల లోపు పిల్లలను పనులలో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ మానవ అక్రమ రవాణా (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ నేతృత్వంలోని బృందం నక్కలపల్లి, నల్లగుంట , గుంటూరు పల్లి ప్రాంతాలలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, బీహార్, చత్తీస్గఢ్ రాష్ట్రాలకు చెందిన కార్మికుల పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించుటకు రెస్క్యూ నిర్వహించి, కార్మికులకు కౌన్సిలింగ్ చేయడం జరిగింది.
ఈ సందర్భంగా నల్లగుంట, నక్కలపల్లి, గుంటూరుపల్లి ప్రాంతాలలో ఇటుక బట్టీలు నిర్వహించే యజమానులకు గుంటూరు పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో వసుధ పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు చట్ట ప్రకారంగా బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా సమీప అంగన్వాడీలో గాని లేదా పాఠశాలలోకాని చేర్పించి వారికి విద్యను అందించవలసిన బాధ్యత ఇటుక బట్టీల యజమానులకు ఉందని చెప్పారు. తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని, లేకుంటే బాల్యంలోనే వారి జీవితం చిద్రమవుతుందని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఉమా మాట్లాడుతూ ఇటుక బట్టీలు నిర్వహించే ప్రాంతంలో బ్రిక్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని లేదా సమీప పాఠశాలలో చేర్పించవలసిన బాధ్యత ఇటుక బట్టి యజమానులపై ఉందని, బాలల హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్ గారి ఆదేశాలతో త్వరలోనే ఇటుక బట్టే యజమానులతో, కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.
ఈ బృందం నక్కలపల్లి నల్లగుంట, గుంటూరు పల్లి పాఠశాలలను సందర్శించి అక్షయపాత్ర ద్వారా ఇతర రాష్ట్రాల పిల్లలకు భోజనం అందుతుందా, యూనిఫామ్స్ అందయా లేదా, స్థానిక భాషలో విద్యాబోధన జరుగుతుందా , విద్యా వాలంటీర్స్ అందుబాటులో ఉన్నారా, పిల్లల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, అందరికీ ఆధార్ కార్డులు ఉన్నాయా, అనే విషయాల గురించి
వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకులపల్లి మధు, ఏ హెచ్ టి యు ఏ.ఎస్. ఐ. భాగ్యలక్ష్మి, గుంటూరుపల్లి ఇన్చార్జ్ హెడ్ మాస్టర్ అలీ, నల్లగుంట హెడ్మాస్టర్ లతా, ఇటుక బట్టీల యజమానుల సంఘం అధ్యక్షులు దగ్గుబాటి శ్రీనివాస్ నాయుడు, నరసింహులు, యాకూబ్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి..

## తెలంగాణ ప్రజలకు, గులాబీ సైనికులకు కేటీఆర్ సూచన




హైదరాబాద౹, నేటిధాత్రి:
బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల వేళ తమ ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్‌పై, ఆయన వ్యక్తిత్వం మీద రేవంత్ రెడ్డి విషం చిమ్ముతున్నాడని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి అని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి తిట్ల ట్రాప్‌లో పడకండి అని తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద అని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

**కేటీఆర్ ట్వీట్ యథాతథంగా..**

తెలంగాణ సోదర సోదరీమణులారా,
కోట్లాది మంది ఆశల రూపమైన గులాబీ సైనికులారా, నిజాన్ని నిర్భయంగా చాటే మీడియా మిత్రులారా..
ఇవాళ తెలంగాణ గడ్డపై ఒక వికృతమైన రాజకీయ క్రీడ జరుగుతోంది. పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో, ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి మన స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడు కేసీఆర్. ఒక తండ్రిలా ఈ రాష్ట్రాన్ని అక్కున చేర్చుకుని, పడావు పడ్డ తెలంగాణను ప్రగతి బాటలో నడిపించిన మహోన్నత శిల్పి కేసీఆర్. ఆయన ఎప్పుడూ బిరుదుల కోసం పాకులాడలేదు, సన్మానాల కోసం తపించలేదు. ఎందుకంటే, తెలంగాణ ప్రజల శ్రేయస్సు, సంక్షేమమే ఆయనకు నిజమైన సన్మానం, సత్కారం. ఉద్యమ సారథిగా పద్నాలుగేళ్లు చారిత్రాత్మక పోరాటం చేసినా తొలి ముఖ్యమంత్రిగా తెలంగాణ పల్లె పల్లెను పచ్చగ చేసినా.. ఆయన గుండె చప్పుడు అనుక్షణం తెలంగాణనే !
కానీ, నేడు అధికారం చేతిలో ఉందనే అహంకారంతో, తన వైఫల్యాలను, తన ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ మీద, ఆయన వ్యక్తిత్వం మీద విషం చిమ్ముతున్నాడు. ఇది కేవలం ఒక వ్యక్తి మీద దాడి కాదు.. తెలంగాణ పోరాట చరిత్ర మీద జరుగుతున్న దాడి!
రేవంత్ రెడ్డి 'తిట్ల ట్రాప్'లో పడకండి! మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చర్చ జరగాల్సింది మన వార్డుల్లో మౌలిక వసతుల మీద, రోడ్ల మీద, డ్రైనేజీల మీద, ఇంటింటికీ అందాల్సిన పథకాల మీద. కానీ రేవంత్ రెడ్డి తెలివిగా తన బూతు పురాణంతో అసలు చర్చను పక్కదోవ పట్టిస్తున్నాడు. ఈ విషపు వలలో మనం పడకూడదు. మన చర్చ, మన నిలదీత కేవలం ప్రజల కన్నీటి మీదనే ఉండాలి.
ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాని ఆరు గ్యారంటీల గురించి నిలదీయండి. ఆ నమ్మకద్రోహం మీద యుద్ధంలా చర్చను మార్చండి.
ఎరువుల కోసం క్యూ లైన్లలో పడరాని పాట్లు పడిన అన్నదాతల ఆవేదన గురించి, రైతు భరోసా అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకున్న రైతన్నల కష్టాల గురించి అడగండి.
ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక చదువులు ఆగిపోతున్న బిడ్డల మానసిక ఘర్షణకు గురుకులాల్లో విషాహారం తిని అల్లాడిపోతున్న పసి ప్రాణాలకు బాధ్యత ఎవరిదని రేవంత్ రెడ్డిని గల్లా పట్టి అడగండి.
రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న వృద్ధుల మనోవేదనకు, డీఏలు లేక, పీఆర్సీ ఊసే లేక నలిగిపోతున్న ఉద్యోగుల ఘర్షణకు గొంతుకగా మీరు నిలవండి.
సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ఇంటింటికీ వెళ్లి వివరించండి. మన తెలంగాణ నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి అనే 'కోవర్టు' ద్రోహంపైనిప్పులు చెరగండి.
ప్రజల తీర్పే.. కేసీఆర్ కు ఇచ్చే అసలైన గౌరవం! పదేళ్ల ఉజ్వల ప్రగతి తర్వాత, ఈ రెండేళ్లలో తెలంగాణ అనుభవిస్తున్న ఈ దుర్గతికి కారణాలను ప్రజల ముందుకు తీసుకెళ్లండి.
రేవంత్ రెడ్డి గాలి మాటలకు, గాయిగత్తర బూతులకు కాలం చెల్లింది. సమస్యల నుంచి పారిపోవడానికి ఆ అసమర్థుడు వేస్తున్న పాచిపోయిన పాచికలను తిప్పికొట్టండి.
తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఒక ధ్రువతార. ఆయన కీర్తి, ఆయన స్ఫూర్తి నిరంతరం వెలుగులీనుతూ మనకు మార్గదర్శనం చేస్తూనే ఉంటుంది.
తెలంగాణ బిడ్డలారా.. చీకటి ఉన్నంత కాలం అబద్ధం ఆటలాడుతుంది.. కానీ సూర్యోదయం కాగానే తోకముడిచి పారిపోతుంది. తెలంగాణకు ఇది గ్రహణ కాలం. రేవంత్ అనే రాహువు తెలంగాణను కబళిస్తునకాలం. ఇప్పుడు రాష్ట్ర ప్రజలను రక్షించుకోవాల్సిన బాధ్యత మన భుజస్కంధాలపై ఉంది. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై, ఆయన చేస్తున్న ద్రోహంపై ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపిద్దాం.
మన దృష్టిని ప్రజల సమస్యల మీదనే ఉంచుదాం.. మనకు ప్రాణసమానమైన తెలంగాణను ప్రజాస్వామ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుందాం.
జై తెలంగాణ! జై జై తెలంగాణ !! జై కేసీఆర్!

# కాంగ్రెస్ పార్టీలో నా మెడ నరకాలని చూస్తున్నరు..



## సీనియర్ నేత జీవన్‌రెడ్డి భావోద్వేగం

హైదరాబాద్, నేటిధాత్రి:
జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల్లో తన వర్గానికి సీట్లు కేటాయించకుండా పక్కకు పెట్టడంపై ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయంగా తన మెడ నరకడానికి కాంగ్రెస్ పార్టీలో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన భుజాలుగా ఉన్న వ్యక్తులను తనకు దూరం చేశారని చెప్పారు.
పార్టీ మారితే రాళ్లతో కొట్టమని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రచారం సందర్భంగా పార్టీకి చెందిన మహిళలు, కార్యకర్తలతో ఆయన తన బాధను చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. దాంతో వారు జీవన్‌రెడ్డిని ఓదార్చారు. మున్సిపాలిటీలో తాము మీ వర్గాన్ని గెలిపించి తీరుతామని చెప్పారు. కాగా చట్టసభలకు ఏ పార్టీ తరఫున గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని గతంలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు.
రేవంత్ రెడ్డి ఆయన పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని గతంలో చెప్పారని, కానీ ఆయనే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేరే పార్టీల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన వాళ్లను ఓటుతో కొట్టాలని తాను అంటున్నానని చెప్పారు. తన వర్గం వారికి కాంగ్రెస్ సీట్లు నిరాకరించడంతో కొన్ని వార్డుల్లో స్వతంత్ర్యులుగా బరిలో దిగిన తన వర్గం వారి తరఫున జీవన్‌రెడ్డి ప్రచారం చేశారు.
బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వర్గాన్ని పక్కనపెట్టి.. తనతోపాటు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. సంజయ్ కుమార్ తాను బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్నారని, కానీ కాంగ్రెస్ జెండా పట్టుకుని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌లోనే ఉన్నా అంటూ సంజయ్ కాంగ్రెస్ జెండాను ఎత్తుకుపోయాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడ్డారని వ్యాఖ్యానించారు.

# అలియాబాద్ మున్సిపాలిటీలో రెచ్చిపోయిన కాంగ్రెస్ గూండాలు.. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా ఆలియాబాద్ మున్సిపాలిటీలోని లాల్‌గడి మలక్‌పేటలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాష్టీకానికి ఒడిగట్టారు. డీజే సౌండ్ తగ్గించాలని కోరితే బీఆర్‌ఎస్ కార్యకర్తల పై దాడి చేశారు. దాడిలో లాల్‌గడీ మలక్‌పేటకు చెందిన



పరమేష్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగా, దాడి చేయడమే కాకుండా కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు జంగయ్య యాదవ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ గుండాల దాడిలో మాజీ మంత్రి మల్లారెడ్డి కారు అద్దం పగిలిపోయింది. కాంగ్రెస్ పార్టీ ఆరాచాకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మొబైల్ రికవరీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాతీయ కీర్తి

**సాంకేతికతతో గుర్తింపు... సేవతో పరిష్కారం**

**సి.ఇ.ఐ.ఆర్ తో విశిష్ట విజయం సాధించిన జిల్లా పోలీసులు**

**78 శాతం మొబైల్ రికవరీ రేటుతో దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం**

**జిల్లా పోలీసుల పనితీరును ప్రశంసించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి**



**సిరిసిల్ల,నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి విశిష్ట ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. సి.ఇ.ఐ.ఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం గర్వకారణమైన విజయం సాధించారు. జిల్లాలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, సి.ఇ.ఐ.ఆర్ అప్లికేషన్‌ను సమర్థంగా ఉపయోగించడం ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,286 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేస్తూ 78 శాతం రికవరీ రేటు సాధించడం విశేషం. ఈ అద్భుతమైన పనితీరుతో దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి జిల్లా పోలీస్ అధికారులను అభినందిస్తూ ప్రశంసలు కురిపించి, హర్షం వ్యక్తం చేశారు. మొబైల్ రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ (డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్), న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్‌లో మొదటి స్థానం జిల్లా పోలీసులకు దక్కడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన కేరళ లోని ఎర్నాకులంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే హాజరై, సి.ఇ.ఐ.ఆర్ ద్వారా మొబైల్ ఫోన్ రికవరీలో అనుసరించిన ఉత్తమ విధానాలు, కార్యాచరణ వ్యూహాలు, విజయవంతమైన అనుభవాలను కాన్ఫరెన్స్‌లో వివరించి అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ రికవరీలో ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించడం తెలంగాణ పోలీసుల పనితీరు, నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యతాయుతంగా, తక్షణ స్పందనతో వ్యవహరించడం, సి.ఇ.ఐ.ఆర్ వంటి ఆధునిక డిజిటల్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం, సాంకేతిక నైపుణ్యంతో ట్రాకింగ్ నిర్వహించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా తక్షణమే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. మొబైల్ ఫోన్ రికవరీలో విశేష ప్రతిభ కనబర్చిన ఐటీ కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ తిరుమలేష్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజల నమ్మకాన్ని బలపరచే విధంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని ఎస్పీ తెలిపారు.

# ఎన్నికలు పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి కమిషనర్ చంద్రశేఖర్



**మేడ్చల్,నేటిధాత్రి:** మునిసిపల్ ఎన్నికలు పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని అలియాబాద్ మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం పి ఓ, ఏ పి ఓ లకు మజీద్ పూర్ శ్రీ చైతన్య పాఠశాలలో మున్సిపల్ కమిషనర్, ట్రైనర్స్ ఆధ్వర్యం లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరయ్యే పి ఓ, ఏ పి ఓ ఎన్నికల విధులపై శఅవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ, ఏ ఆర్ ఓ లు, ఎన్నికల సిబ్బంది, ట్రైనర్స్ పాల్గొన్నారు.

# నియోజకవర్గ సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే జి ఎస్ ఆర్

**చిట్యాల,నేటిదాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో శుక్రవారం రోజున చిట్యాల, రేగొండ, టేకుమట్ల, ఘన్పూర్ గోరుకొత్తపల్లి, మొగుళ్ళపల్లి, శాయంపేట, భూపాలపల్లి 8 మండలాల సీఎం కప్ నియోజకవర్గ క్రీడలను ప్రారంభించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అంతకుముందు విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు,





అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడలు మానసిక ఆరోగ్యానికి స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ఉన్నత స్థాయికి తీసుకుపోవడంలో ఉపాధ్యాయులు అధికారులు ప్రోత్సహించాలన్నారు, అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కబడ్డీ ఆడి నారు, కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో జయశ్రీ తాసిల్దార్ ఇమామ్ బాబా, క్రీడల కన్వీనర్ ఎంఈఓ రఘుపతి, సర్పంచ్ తవు టం లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుట్ల తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ మాజీ ఎంపిటిసి దబ్బేట అనీల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధరి రవి, కాంగ్రెస్ నాయకులు చిలకల రాయకొమురు, బుర్ర లక్ష్మణ్ గౌడ్ , గుర్రపు నరసయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్కల్ పీహెచ్సీలో రూ.16 లక్షల అభివృద్ధి పనులు పూర్తి



**జహీరాబాద్,నేటిధాత్రి:** న్యాల్కల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ( పి హెచ్ సి ) రూ. 16 లక్షల సిసిఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మరుగుదొడ్ల సమస్య, శిథిలావస్థలో ఉన్న పైకప్పు, తాగునీటి సౌకర్యం లేకపోవడం, సమావేశ భవనం కొరత వంటి ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పనులు చేపట్టారు. ఉన్నతాధికారుల స్పందనతో మరుగుదొడ్ల మరమ్మతులు, పైకప్పు పునరుద్ధరణ, తాగునీటి సౌకర్యం, సమావేశ భవనం నిర్మాణం పూర్తయ్యాయి. ఈ అభివృద్ధి పనులను శుక్రవారం డి ఎం హెచ్ వో ప్రారంభించనున్నారు. దీంతో పి హెచ్ సి లో వైద్య సేవలు మెరుగుపడతాయని, సిబ్బంది ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు తెలిపారు.

# వార్డు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తా

**19వ వార్డు అభ్యర్థి ఏకు బాబు**



**పరకాల,నేటిధాత్రి:** ఏకు బొబ్బిలి(బాబు) ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఇన్చార్జిలు బొట్ల శ్రీను,దోమల శ్రీనివాస్ వార్డు అధ్యక్షులు ఏకు కార్తీక్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి బాబు మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మీ సమస్య లకోసం పోరాడుతనని వార్డు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని మీ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి అధిక మెజార్టీతో గెలిపించి రాబోయే రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ జలాలుద్దీన్,సాదిక్,బండి శ్రావణి,బొచ్చు రాజు,ఏకు ప్రవీణ్,ఏకు శివతేజ, కొమ్ముల మహేష్,ఒంటేరు రాకేష్,ఏకు వంశీ మరియు వార్డు పెద్దలు పాల్గొన్నారు.

# చెయ్యి గుర్తుకు ఓటు వేసి కౌన్సిలర్ గెలిపించండి

**కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సొత్కు రామ సమ్మయ్య**



**భూపాలపల్లి,నేటిధాత్రి:** 8వార్డు ప్రజలు ఆదరించి మున్సిపల్ కౌన్సిలర్గా చెయ్యి గుర్తుకు ఓటేవేసి గెలిపించండి పాలకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలు బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి సొత్కు రామ సమ్మయ్య ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల సమస్యలే ఎజెండాగా 8వార్డు లోని అన్నికాలనీలను అన్ని రంగాల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్ సహకారంతో నిధులు తీసుకువచ్చి కాలనీలను సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. జోహార్ నగర్ కాలనీల్లో మంచి నీరు అందేవిదంగా, డ్రైనేజి సమస్యలేకుండా, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం, లేని వారికి రేషన్ కార్డుల అందించేవిధంగా, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు, ఆలయాల అభివృద్ధికి, అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమం అందేలా కృషి చేస్తానని తెలిపారు. కాలనీ ప్రజల కోరిక, సహకారం మేరకు అభివృద్దే లక్ష్యంగా ఎలాంటి అవి. నీతి లేకుండా, నిజాయితీగా తోడ్పడుతానని తెలిపారు. చెయ్యి గుర్తకు ఓటేసి నాపై నమ్మకంతో ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించండని ఓటర్లను అభ్యర్థించారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన హరిహర క్షేత్రం శ్రీ చిలుకశ్వేర అంజనేయు స్వామి దేవాలయం కమిటీ



**ఉప్పల్,నేటిధాత్రి:** ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రమా కిషోర్ ని మరియు కమిటీ సభ్యులను ఆలయకమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎంతైనా ఉందని సమాజంలో జరిగే అని విషయాలను ప్రజలకు తెలియజేస్తూ.. అభివృద్ధి మరియు సమస్యలను ఎత్తి చూపుతూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే భాధ్యతను వారు నిర్వహిస్తారని అన్నారు. చిల్కానగర్ శివాలయం పున్నరునిర్మాణంలో కూడా పాత్రికేయు సోదరుల సహాయ సహకారాలు ఉండాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మరియు ఆలయకమిటీ సభ్యులు జెల్లీ మోహన్, గోనె అంజయ్య, గోపాల్ రెడ్డి, కావాలి నర్సింహ్మా, మాస శేఖర్, పైడిపాల గౌరయ్య, దండు అంజయ్య, పోలోజు శ్రీనివాస్ చారి, రుద్రరపు శంకర్, మాడుగుల శ్రీనివాస్ యాదవ్, కాసుల రామకృష్ణ, మల్లేష్ ముదిరాజ్, నాని ముదిరాజ్, పాల్గొన్నారు.

# ప్రజా సేవ కోసం 34వ డివిజన్ అభ్యర్థిగా దీవించండి

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుతో మీ ముందుకు**

**ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తా**

**సింహం ల మీ ముందుకు వస్తున్న ముస్కె రవికిరణ్ యాదవ్**



**మంచిర్యాల,నేటిధాత్రి:** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 34వ డివిజన్ తెలంగాణ జాగృతి బలపరుస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్న ముస్కె రవికిరణ్ యాదవ్ సింహం గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు కల్పించే మౌలిక వసతులు ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, శుద్ధి చేసిన తాగునీరు సరఫరా, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు, పాత లైట్ల మరమ్మతులు చేపించడం. పేదల సంక్షేమ కొరకుఅర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టడం. డబల్ బెడ్ రూమ్, ఇండ్ల స్థలాల కోసం నిరంతర పోరాటం, వృద్ధులు, వికలాంగుల కొరకు పెన్షన్ సదుపాయం కల్పించడం. విద్య, యువత ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు స్టడీ సర్కిల్స్, లైబ్రరీలు యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు కల్పించడం. మహిళల అభివృద్ధి కోసంమహిళల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళ సంఘాలకు ప్రోత్సాహం కల్పించి అన్ని విధాల అండగా ఉంటామని వారు తెలిపారు. 34వ డివిజన్ లో ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు సేవ చేసే నాయకుడికి తమ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# 19వ వార్డులో డిఎస్పీ అభ్యర్థి ప్రచారం

**పరకాల,నేటిధాత్రి:** మున్సిపల్ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి బొచ్చు నాగరాజు 19వవార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించాడు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పరకాలలో ఎన్నికలు అంటే పార్టీలకి పార్టీల కి మధ్య పోటీ కాదని పేదలకి ధనవంతుల కి మధ్య పోటీ జరుగుతుందని అన్నారు. వార్డులో సరైన రోడ్లు లేవు, డ్రైనేజీ, బస్తీ దవాఖాన లేదని ప్రభుత్వ పథకాలు ప్రజలకి అందజేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఈరోజు మల్లి డబ్బులతోనే రాజకీయాలకు వస్తున్నారని ఇలాంటి రాజకీయ పార్టీలకు నాయకులకి బుద్ధి చెప్పడానికి టార్చ్ లైట్ గుర్తు పై



ఓటువేసి నన్ను అత్యధిక మెజార్టీ తో గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మైదం రవి, రాష్ట్ర నాయకులు రత్నాకర్, మండల అధ్యక్షులు కోడపాక ప్రతాప్, సురేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూజలు హాస్యాస్పదం

**నియోజకవర్గాన్ని గోదావరి నది జలాలతో సస్యశ్యామలం చేసిన ఘనత పెద్దికే దక్కుతుంది.**

**గోదావరి నీళ్లకు పూజలు చేసిన సర్పంచ్ సపావట్ కవిత దేవ్ నాయక్.**




**నల్లబెల్లి,నేటిధాత్రి:** గోదావరి జలాలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పూజలు చేయడం హాస్యస్పదమని సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ అన్నారు. ఈ మేరకు మండలానికి గోదావరి జలాలు తరలివచ్చే మాన్సింగ్ తండా మెయిన్ కెనాల్ వద్ద సర్పంచ్ గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఏడు గ్రామాల తోపాటు వేలాది సాగు భూములను ముంపుకు గురి చేసేందుకు యత్నించి రంగయ్య చెరువు ప్రాజెక్టు నిర్మాణానికి ఒడిగట్టిన సంగతి మండల ప్రజలకు తెలిసిందే అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మండలంలోని ఏజెన్సీ గ్రామాల రైతుల విన్నపం మేరకు ముంపును నివారించి ప్రాజెక్టును నిర్మాణం చేసి నల్లబెల్లి ఖానాపూర్ నర్సంపేట చేన్నారావుపేట మండలాల ను సస్యశ్యామలం చేయడమే ధ్యేయంగా రిటైర్డ్ ఇంజనీర్లతో ప్రత్యేక సర్వేలు చేపట్టి గోదావరి జలాలను తరలించేందుకు ప్రణాళికలు రూపొందించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించిన మాజీ సీఎం కేసీఆర్ తక్షణమే రూ, 305 కోట్ల నిధులను విడుదల చేశారన్నారు. ఇట్టి నిధులతో రామప్ప వద్ద పంపు హౌస్ ఏర్పాటు చేసి రెండు పైపులైన్ల ద్వారా రంగయ్య చెరువు, పాకాల, మాదన్నపేట చెరువులకు గోదావరి జలాలతో నింపి బీడు భూములను సైతం సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి దక్కుతుందన్నారు. అయినప్పటికీ ఎమ్మెల్యేగా గెలిచిన



తర్వాత దొంతి మాధవరెడ్డి మరో మారు వేలాది ఎకరాలతో పాటు ఈ ప్రాంత ఏజెన్సీ గ్రామాల ముంపున కు గురి చేసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదికలు పంపిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలిసిందే అన్నారు. లోపాయ కారకంగా ఏజెన్సీ గ్రామాలతో పాటు భూములను ముంపుకు గురిచేందుకు కుట్రలు చేస్తూనే మరో ప్రక్క ప్రజలను నమ్మించేందుకు తమ నేత తీసుకువచ్చిన గోదావరి జలాలకు కపట ప్రేమ వలకబోస్తూ పూజలు చేయడం హాస్యస్పదం గా ఉందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే మండల రైతాంగం తో పాటు నియోజకవర్గ రైతులకు గోదావరి జలాలు సమృద్ధిగా అందేందుకు నిలిచిపోయిన కుడి ఎడమ కాలువల పనులను పూర్తిచేస్తూనే ప్రధాన కాలువలకు తూములు ఏర్పాటు చేసి అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఇస్లావత్ రవీందర్, బానోతు వనిత లక్ష్మణ్ ,అరుణ శ్రీను, విజయ నరసింహ ప్రేమ్ కుమార్, సపావట్ స్వరూప మంగణ నాయకులు మంజీలాల్ బోడ సురేష్, బొమ్మిడి శివ రెడ్డి ,బానోతు బక్షనాయక్ ,మంగణ నాయక్ ,నరసింహ చారి ,సతీష్ ,ఉమేష్ ,ప్రశాంత్ రెడ్డి సాయిలు, యాకన్న ,రమేష్ ,చిన్నయాకు ,విజయ్ ,వెంకన్న, హుస్సేన్, వాల్యా సంగులాల్ ,రత్తి చంద్రు, యూత్ సభ్యులు బానోతు నితిన్, పవన్ ,యాకు బన్నీ మున్నా, నవీన్ ,దినేష్ సాయి, రణధీర్ ,రాంబాబు, నితిన్ సంతోష్ గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి 33 వ వార్డులో పూర్తిస్థాయిలో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి



**వనపర్తి,నేటిధాత్రి:**వనపర్తి జిల్లా కేంద్రంలో 33 వ వార్డులో పూర్తిస్థాయిలో ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయలేదని జిల్లా కిసాన్ మార్చ బిజెపి నేత ఏర్పుల జ్ఞానేశ్వర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు 33 వ వార్డులో ఓటర్ స్లిప్పులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయకుంటే వనపర్తి జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారి కి ఫిర్యాదు చేస్తామని చెప్పారు

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

## 22వ వార్డు అభ్యర్థి ఇంగిలి వీరేష్



**పరకాల,నేటిధాత్రి:**మున్సిపాలిటీ పరిధిలోని 22వవార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఇంగిలి వీరేష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట తిరుగుతూ యువ నాయకునిగా మీ ముందుకు వస్తున్నానని ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో ఉన్న డ్రైనేజీ, పారిశుద్ధ సమస్యలను రోడ్లను అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతానని ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు సమస్య ల పరిష్కరానికి శ్రమిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సందర్శించిన సర్పంచ్



**జహీరాబాద్,నేటిధాత్రి:**కొల్లూరు గ్రామంలో గల ఉపాధి హామీ 100 రోజుల పనికాహార పథకం పనులను కొల్లూరు గ్రామ సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ సందర్శించారు.వేసవి కాలంలో ఎండ తీవ్రత యెక్కువ వుంటుంది కాబట్టి పనికివచ్చేవాళంతా తప్పకుండా నీళ్ళు, భోజనం తెచ్చుకోవాలని తగు జాగ్రత్తలు సూచించడం జరిగింది... ఈ కార్యక్రమములో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ చింతలగట్టు సుబాకర్, వార్డు సభ్యులు చింతలగట్టు ప్రకాష్ ,మంగలి రమేష్, దప్పూర్ శ్రీశైలం, కుమ్మరి దేశరథ్,చింతలగట్టు అబ్రహం, పారిశుధ్య కార్మికులు దేవదాస్, నర్సింలు, అనిల్ తదితరులు ఉన్నారు...

# వినోద్ స్వామి పడి పూజ భక్తిశ్రద్ధలతో వేడుకలు



**జహీరాబాద్,నేటిధాత్రి:**జహీరాబాద్ గ్రామంలోని వెంకటరమణ కాలనీలో వినోద్ స్వామి పడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు, శివ స్వాములు భజనలతో, ఉత్సాహంగా పాల్గొని, సంతోషంగా పూజ నిర్వహించారు. గురు స్వాములు జి. నగేష్, బి. ప్రశాంత్, బి. సాయి కుమార్, ఎం. గణేష్ (పంతులు), శరత్, బంగారప్ప, మరియు శానిదానం అందరికీ వినోదం కుమార్ తన నమస్కారాలు తెలియజేశారు. ఈ వేడుకలో అందరూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

# ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటా

## పావుశెట్టి సునీల్ 7వ వార్డు అభ్యర్థి



**పరకాల,నేటిధాత్రి:** పట్టణంలోని 7వ వార్డులో పావుశెట్టి సునీల్ విస్తృత ప్రచారం నినాదాలతో ఉత్సాహంగా సాగింది. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. తాగునీరు,డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానన్నారు. వార్డు అభివృద్ధికి సమిష్టిగా పని చేస్తామని తెలిపారు. ప్రజల మద్దతే తన బలమని ఎన్నికల్లో విజయం సాధిస్తామనే నమ్మకం వ్యక్తం చేశారు. ప్రచారంలో నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌన్సిలర్ గా గెలిపియండి సేవకురాలిగా పనిచేస్తా

## భూపాలపల్లి 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఉడుత సరోజన రాజమల్లు



**భూపాలపల్లి,నేటిధాత్రి:**మునిసిపల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే సేవకురాలిగా పనిచేస్తానని 6వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఉడుత సరోజన రాజమల్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతోందన్నారు. ఉచిత బస్సు, మహిళలకు రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, వంటగ్యాస్ పై సబ్సిడీ, ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టి పేదింటి అభివృద్ధికి చేయూతగా ఉంటోందన్నారు. తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వార్డు ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

# సిపిఆర్ తో చివరి వరకు ప్రయత్నం చేసిన 108 సిబ్బంది

## ప్రోగ్రాం మేనేజర్ పాటి శివ కుమార్



**భూపాలపల్లి ,నేటిధాత్రి:**రోగికి అవసరమైన ఆక్సిజన్ సౌకర్యం పూర్తిగా అందుబాటులో ఉందని, పరిస్థితి విషమించిన వెంటనే 108 సిబ్బంది సిపిఆర్ చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు నిరంతరం ప్రయత్నం చేశారని ప్రోగ్రాం మేనేజర్ పాటి శివ కుమార్ అన్నారు అలాగే, బాధితుడు ఇప్పటికే హార్ట్ పేషెంట్ కావడంతో పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారిందని పేర్కొన్నారు. అయినప్పటికీ, 108 ఎమర్జెన్సీ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, నిర్దేశిత ప్రోటోకాల్స్ ప్రకారం అన్ని వైద్య సహాయక చర్యలు చేపట్టారని పైలట్, ఈ ఎం టి లు స్పష్టం చేశారు. రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు చివరి క్షణం వరకు ఆక్సిజన్ సపోర్ట్, సిపిఆర్ వేగవంతమైన తరలింపు వంటి అత్యవసర సేవలు అందించామని తెలిపారు. ఈ క్రమంలో 108 సిబ్బంది చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయం అని ప్రోగ్రాం మేనేజర్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 108 సేవలపై నమ్మకం ఉంచాలని, 108 ఎమర్జెన్సీ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజల సేవకు సిద్ధంగా ఉంటారని ఆయన అన్నారు.

# 20వార్డు పద్మ గెలుపు కొరకు ఇంటింటి ప్రచారం

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్

**భూపాలపల్లి,నేటిధాత్రి:**భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి ఇస్లావత్ రాజు నాయక్- పద్మ పార్టీ కౌన్సిలర్ గెలుపు కొరకు ఎన్నికల ప్రచారం నిర్వహించిన భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి టీపీసీసి సభ్యులు చల్లూర్ మధు,పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు స్థాయిలో పార్టీ కార్యాలయాల ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సమస్యలను వెంటనే పరిష్కరించేలా పనిచేస్తామని తెలియజేయడం జరిగింది ఉచిత కరెంటు 200 యూనిట్లు, 500



రూపాయలకు వంట గ్యాస్, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం, రైతు భరోసా, ఏకకాలంలో రైతు రుణమాఫీ, రైతు బీమా, ఆరోగ్యశ్రీ 10 లక్షలు, ప్రతినియోగ వర్గంలో ఇంటిగ్రేడ్ హై స్కూల్, రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ముందు సంక్షేపతకలతో ముందుకు వెళుతుందని తెలియడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మాట్టేవాడ సురేష్, శనిగరపు తిరుపతి, మంతెన సాంబయ్య, నోముల నారాయణ, ఇస్త్రారి, యూత్ కాంగ్రెస్ నాయకులు అప్పాల శీను, రాజశేఖర్ జన్ను, కోయిల క్రాంతి, రాజు, తదితరులు పాల్గొనడం జరిగింది

# ప్రచారంలో దూసుకుపోతున్న రడం శివ జ్యోతి

## కాంగ్రెస్ పార్టీ కే ఓటెయ్యండి... అభివృద్ధికి బాటలు వేయండి

**కేసముద్రం,నేటిధాత్రి**:కేసముద్రం మున్సిపాలిటీలోని కేసముద్రం విలేజ్ లో మున్సిపల్ ఎన్నికల గడప గడప ప్రచారంలో 10వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని రడం శివజ్యోతి ప్రచారంలో దూసుకుపోతున్నారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరిస్తూ తాను గెలిస్తే





ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ అందిస్తానని మరియు కేసముద్రం మున్సిపాలిటీ లో 10 వ వార్డు అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో శివజ్యోతి మాట్లాడుతూ మా కుటుంబం గతం నుండి రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం అని ప్రజలకు సేవ చేయాలని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పలాలను సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తుందని ఈ అభివృద్ధిలో భాగం పంచుకునేందుకు నాకు అవకాశం దక్కిందని 10వ వార్డు కౌన్సిలర్ గా ఎన్నికల బరిలో నిలుచున్నానని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి నన్ను అత్యధిక మెజార్టీ గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈ ప్రచారంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్

కాంగ్రెస్ ఉధృత ప్రచారంలో పాల్గొని వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మరియు పేదలకు సన్న బియ్యం గృహజ్యోతి మరియు ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎన్నో సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను గడప గడప వివరిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 10 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రణం శివజ్యోతిని అత్యంత మెజార్టీతో గెలిపించండి అని 10 వ వార్డ్ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. కేసముద్రం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 16 వార్డుల అభ్యర్థులను గెలిపించుకొని మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నవారు మాజీ సర్పంచ్ రడం వెంకన్న, కాటంరాంరెడ్డి, చిట్ల రవి, బండారి దయాకర్, ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్ , చిన్నాల కట్టయ్య, చింతనూరి సతీష్ , బైరు వెంకన్న యనమల మహేందర్, తోట వెంకన్న , ఎలకల బోయిన అనిల్ , బుర్ర సుధాకర్, కుమార్ వెన్ను ఎల్లయ్య , యాకూబ్ పాషా, హమీర్, మహిళ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడ్డగోలు మాటలతోనే అరూరి అడ్రస్ గల్లంతు

## ఓడించి ఇంటికి పరిమితం చేసినా బుద్ధి రాలే కార్యకర్తలను గాలికొదిలేసిన చరిత్ర అరూరిది

## అన్న అంటే అందుబాటులో ఉంటున్నది ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

## లక్ష మేజారిటి అని గొప్పలు చెప్పుకున్న అరూరిని సోంత పార్టీ కార్యకర్తలే ఓడించింది నిజం కాదా..?

## గ్రామాల్లో ఒక్క ఇళ్లు కూడా పెదలకు కట్టని అరూకి ప్రజల గురించి, అభివృద్ధి గురించి మాట్లాడడం సిగ్గుచేటు

## నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట,నేటిధాత్రి**: లక్ష మెజారిటి గొప్పలకు పోయి కన్ను మిన్ను కానకుండా ప్రజలను, పార్టీ కార్యకర్తలను, ఉద్యమకారులను పక్కనబెట్టి అక్రమ సంపాదనకు పాకులాడి అభివృద్ధి మరిచి ఉకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చాడనే అరూరి రమేష్ ను చిత్తుగా ఓడించి ఇంటికి పరిమితం చేసినా ఇంకా అడ్డగోలుగా మాట్లాడడం మారలేదని నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, వర్ధన్నపేట యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు బీజేపి సంకలో ఉన్న అరూరికి అక్కడ కూడా ఎవరు పట్టించుకోకపోవడంతో దిక్కు తోచక బిఆర్ఎస్ పార్టీలో చేరిన అరూరి రమేష్ వాస్తవాలు మాట్లాడకుండా ఆ పార్టీ పెద్దల మెప్పు కోసం నోటికొచ్చింది మాట్లాడుతున్నాడని యాకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న 10 సంవత్సరాలు పార్టీని నమ్ముకున్న ఏ కార్యకర్తను, ఉద్యమకారులను కనీసం పట్టించుకోకుండా కేవలం కాంట్రాక్టుల మీద శ్రద్ధ పెట్టి వందల కోట్ల రూపాయలు దండుకున్న అరూరి నేడు మున్సిపల్ ఓట్లు రాగానే కార్యకర్తలు రావడం ఆయన స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ పనికిరాని మాటలు మాట్లాడారనే సొంత పార్టీ కార్యకర్తలే సాదారణ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పారని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ తనకంటూ ఏ స్వార్థం లేకుండా కేవలం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అక్కున చేర్చుకుంటే అన్ని కష్టనష్టాల్లో వెన్నంటి ఉండి పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేస్తున్న పరిస్థితులను చూసి తట్టుకోలేకే తప్పుడు కూతలు కుస్తు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే అరూరి రమేష్ రాజకీయ భవిష్యత్తు మరింత అంధకారంలోకి వెళ్లడమే గాక బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు గాక తప్పదని యాకాంతం అన్నారు. నియోజకవర్గంలో గత పదేళ్ల పాలనలో ఏ గ్రామంలో ఒక్క ఇళ్లు కూడా కట్టని అరూరి రమేష్ దమ్ముంటే నేడు నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణమౌతున్నాయో లెక్క పెట్టి బుద్ధి తెచ్చుకోవాలని యాకాంతం సూచించారు. ఇప్పటికైనా అరూరి రమేష్ వాస్తవ విషయాలను మాట్లాడి మార్పు తేచ్చుకోకుంటే ఆయన వర్ధన్నపేట మునిసిపల్ ఎన్నికల్లో ఒక్క వార్డు కూడా గెలవకుండా డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని ఎన్ని కుట్రలు చేసినా వర్ధన్నపేట మునిసిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని యాకాంతం ధీమా వ్యక్తం చేశారు.

# క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జహీరాబాద్,నేటిధాత్రి:**ఝరాసంగం గ్రామంలో జహీరాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాణిక్ రావు, గ్రామ పెద్దల సహకారంతో సందర్భంగా నిర్వహించిన గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. శాసనసభ్యులు మాణిక్ రావు మాట్లాడారు. గ్రామ ప్రజలందరికీ వచ్చే మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆటల వల్ల శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయి ఇవి కండరాల బలం గుండె ఆరోగ్యం మెరుగైన రక్త ప్రసరణను అందిస్తూ ఒత్తిడిని తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే బృంద కృషితో



కూడిన ఆటలు యువకుల్లో నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ జట్టుగా పని చేసే నైపుణ్యాన్ని (Team Work) అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ వినోద బాలరాజ్ ఉప సర్పంచ్ గడ్డం మమత అనిల్ పటేల్ మండల అధ్యక్షుడు వెంకటేశం మాజీ ఎంపీపీ సంగమేశ్వర్ తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వర్ మాజీ ఎంపీటీసీ సంతోష్ రజిని ప్రియ టౌన్ ప్రెసిడెంట్ ఎజస్ బాబా నాగన్న పటేల్ సర్జన్ నాగేశ్వర్ శీను పటేల్ సద్దాం సజావుద్దీన్ మరియు ఆయా గ్రామాల సర్పంచులు కార్యకర్తలు మెంబర్ పాల్గొన్నారు.

# షాకీర్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు



**జహీరాబాద్,నేటిధాత్రి:**సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని సింగితం గ్రామ శివారులో ఉన్న సుల్తాన్ హైమద్ దర్గాను మిత్రుడు షాకీర్ మరియు వారి కుటుంబ సభ్యులు పునరుద్ధరించినందుకు సింగీతం గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సింగితం గ్రామ సర్పంచ్ కె. శ్రావణి నిరంజన్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆధునికీకరణ కార్యక్రమానికి షాకీర్ మరియు వారి కుటుంబం అందించిన సహకారాన్ని గ్రామస్తులు ప్రశంసించారు. సింగితం గ్రామంలో 'ఊర గంధం' మహోత్సవం ఘనంగా జరిగిందిసింగితం గ్రామంలో హజరత్ సుల్తాన్ అహ్మద్ షా ఉర్సు (జాతర) సందర్భంగా, నిన్న రాత్రి



గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కుస్నూర్ శ్రావణి నిరంజన్ అధ్యక్షతన 'ఊర గంధం' మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, స్థానిక ఎస్ఐ చైతన్య కిరణ్, ఉప సర్పంచ్ పెద్దగొల్ల మహేష్,బిఆర్ఎస్ నాయకులు, మైనార్టీ నాయకులు, నిర్వాహకులు, వార్డు సభ్యులు, నాయకులు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 9వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి

## గడప గడప ప్రచారంలో రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్



**మేడ్చల్,నేటిధాత్రి:**పని చేసేవారికి పట్టం కట్టాలని బి ఆర్ ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే మంచిరోజులు వస్తాయని రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్, జిల్లా అధ్యక్షులు వేల్పుల శ్రీనివాస్ అన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీలో ని 9వ వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూము యమున శ్యామ్ పటేల్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగాఅ లియాబాద్ మున్సిపాలిటీ లో పోటీచేస్తున్నారని కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి చాట్ల పల్లి నర్సింగ్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిళ్ళ శ్రీనివాస్, కార్యనిర్వాహన కార్యదర్శి ఆకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారంతో విర్రవీగుతున్న కాంగ్రెస్ బుద్ధిచెప్పాలి.

- 24,25 వ వార్డులలో జోరుగా బిఆర్ఎస్ ఎన్నికల ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.





**నర్సంపేట, నేటిధాత్రి:** అధికారంతో..అహంకారంతో విర్రవీగుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు అభ్యర్థులకు ఈ మున్సిపాలిటీ ఎన్నికలలో బుద్ధిచెప్పాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. 24,25,7,8,9,10,22,23వ వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోరుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆయా వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 24 వ వార్డు అభ్యర్థి పెండెం శివానంద్,25 వ వార్డు అభ్యర్థి నాడెం సునీత- శాంతి కుమార్, 9 వ వార్డు అభ్యర్థి; రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి, 10 వార్డు అభ్యర్థి నాగిశెట్టి పద్మ ప్రసాద్, తో పాటు ఆయా వార్డులలో ఇంటింట ప్రచారం నిర్వహించిన అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నా క్యాంప్ కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉంది నియోజకవర్గ ప్రజలకు సేవ చేసాను. ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆ పార్టీ కొద్ది మంది బ్రోకర్లను పెట్టి ప్రజలపై గుండాయిజం,రౌడీయిజం చేయిస్తున్నాడు. బిఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారు.. కాంగ్రెస్ గుండాలకు ఇదే నా చివరి హెచ్చరిక..మళ్ళీ అధికారంలోకి వచ్చేది మేమే వారికి వడ్డీతో సాహా చెల్లిస్తాం అని పెద్ది పేర్కొన్నారు.రెండు సంవత్సరాలుగా నిధులు ఉన్న రోడ్లు డ్రైనేజీలు ఎందుకు వేయలేదు..ఎన్నికల ముందు రోడ్లను ఎలా వేస్తున్నారు అని ప్రశ్నించారు.దొంతి మాధవరెడ్డి కాంట్రాక్టర్ గా నాణ్యత లేని నాసిరకం పనులు చేస్తున్నాడు. ఆ రోడ్లను పరిశీలన చేయకుండా బిల్లులు చెల్లిస్తే అధికారులు జైలుకు వెళ్లడం ఖాయం అని హెచ్చరించారు. 9వ వార్డులో క్యాంపు కార్యాలయం నిర్మిస్తే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఈ వార్డులో ఉండడం ఇష్టంలేదు అంటున్నాడు. ఇదే వార్డులో 7 కోట్లతో ఆడిటోరియం సెంట్రల్ ఏసి తో నిర్మిస్తే ఇప్పటివరకు దానిని ప్రారంభించలేదు అని ఎమ్మెల్యేను, ఓటు కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకిఈ మున్సిపాలిటీ ఎన్నికలలో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో 7,8,9, 10, 22, 23, 24, 25 వార్డుల అభ్యర్థులు మోతే తిరుపతి రెడ్డి, పెండెం కళ్యాణి వెంకటేశ్వర్లు, రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి, నాగిశెట్టి పద్మ ప్రసాద్, మాదాసి ప్రవీణ్, మంద రిషిత ప్రసాద్, పెండెం శివానంద్, నాడెం సునీత శాంతి కుమార్,మాజీ ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ తక్కల్లపల్లి రవీందర్ రావు, యూత్ నియోజకవర్గ కన్వీనర్ ఎన్ఆర్ఐ శానబోయిన రాజ్ కుమార్, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, గోనే యువరాజు, గందే చంద్రమౌళి,ఎన్నికల ఇంచార్జ్ లు ,బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్,మాజీ కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు,పట్టణ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరుగకుండా



- 100 ఫిర్యాదు చేయాలి ఎస్పీ
- అడ్డుకోవాలి కలెక్టర్

**వనపర్తి, నేటిధాత్రి:** బాల్యా వివాహాలు అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.శుక్రవారం ఐ.డి. ఒ .సి ఆవరణలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ గ్రామీణ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిర్మూలన ప్రచార వాహనానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురబి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారు వనపర్తి, మహబూబ్ నగర్ గద్వాల జిల్లాలలో ఒక్కో జిల్లాలో 10 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాలు,చట్ట ప్రకారం పడే శిక్షల పై విస్తృత ప్రచారం చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరిగే ప్రమాదాలు ఉంటాయన్నారు. పుట్టబోయే పిల్లలు శారీరక ఎదుగుదల లేకపోవడం తల్లి బిడ్డలు అనేక రోగాల బారిన పడి జీవితాలు నాశనం అయిపోతాయని తెలిపారు. బాల్య వివాహాలు చేసే వారి పై ఎలాంటి జాలి లేకుండా చట్ట ప్రకారం కఠిన శిక్షలు వేయడం జెరుతుందని అన్నారు. ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 100..112 నెంబరు కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు బాల్య వివాహం చేసే తల్లిదండ్రులతో పాటు పెళ్లి తంతులో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని, పెళ్ళికి వెళ్ళే బంధు మిత్రుల పై సైతం కేసులు పెట్టడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని చెప్పారు. అనంతరం బాల్య వివాహాలు అరికట్టేందుకు రూపొందించిన ప్రతిజ్ఞ చేశారు. సంతకాల సేకరణలో భాగంగ ప్లెక్సీ పై సంతకాలు చేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్య నాయక్, ఆర్డీఎస్ కోఆర్డినేటర్ చిన్నమ్మ థామస్, ప్రోగ్రాం ఆఫీసర్ చూచేత, సహాయ ప్రోగ్రాం ఆఫీసర్ జూవెద్ ఖురేషి, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పి.డి. డి ఆర్ డి ఓ ఉమాదేవి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి డి సి పి ఓ రాంబాబు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## పదవ వార్డ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను...

- వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పనాస రాజు



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పనాసరాజు అంటున్నారు. ఆదరించి గెలిపిస్తే వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, గడపగడపకు తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఓటర్లు సైతం పనాస రాజుకు బ్రహ్మరథం పడుతుండడంతో పనాసరాజు గెలుపు ఖాయమని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. గతంలో కూడా అభివృద్ధి చేశానని,రాబోయే రోజుల్లో కూడా మరింత అభివృద్ధి చేస్తానని ఓటర్లకు తెలియపరుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

## గెలిపించండి సేవకుడిలా పనిచేస్తా




- 12వ వార్డు అభ్యర్థి ఆకుల లావణ్య శ్రీధర్

**పరకాల,నేటిధాత్రి:** మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు బిజెపి అభ్యర్థి ఆకుల లావణ్య శ్రీధర్ లను గెలిపించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పగడాల కాళీ ప్రసాద్ రావు,డాక్టర్ సంతోష్ కుమార్ లు వార్డు ప్రజలను కోరారు. వార్డులో కార్నర్ సమావేశంలో వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు బిజెపి అభ్యర్థులను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని,బిజెపిని గెలిపిస్తే అన్ని వార్డులను మోడల్ వార్డులుగా తీర్చిదిద్దామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అభ్యర్థి మాట్లాడుతూ వార్డ్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, సేవకుడిగా పనిచేస్తానని,వార్డులోని ప్రతి సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సంతోష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య,గాజుల నిరంజన్ జయంత్ లాల్, ఆకుల రాంబాబు,మెంతుల సురేష్ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



- గణపురం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్ రెడ్డి
- ప్రతీకార రాజకీయాలే ధ్యేయంగా కాంగ్రెస్ అరాచక పాలన
- బరాబర్.. కేసీఆరే తెలంగాణ జాతిపిత
- రేవంత్ రెడ్డి 'కుక్క తోక' వంకర నైజం

**గణపురం, నేటిధాత్రి:**గణపురం మండలం తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన ఉద్యమ సింహం, అపర భగీరథుడు కేసీఆర్‌ను 'తెలంగాణ జాతిపిత'గా పిలవడం మా హక్కు, అది ఎవరూ కాదనలేని సత్యమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. దేశానికి గాంధీ ఎలాగో.. తెలంగాణ గడ్డకు కేసీఆర్ అలాగేనని కొనియాడారు.?అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై కాలం వెళ్లదీస్తోందని కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను, కుంభకోణాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావులపై అక్రమ కేసులు బనాయించడం రేవంత్ రెడ్డి పిరికిపంద చర్యని ధ్వజమెత్తారు. ప్రతీకారేచ్ఛతో ప్రతిపక్ష నేతలను వేధించడం మానుకోవాలని హెచ్చరించారు. ఇది ఎలా ఉందంటే ?సీఎం రేవంత్ రెడ్డి నైజం కుక్క తోక వంకర అన్న చందంగానే ఆయన ప్రవర్తన ఉందని ఎండగట్టారు. చివరికి ఉద్యమ నేత కేసీఆర్ మరణాన్ని కోరుకునే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారడం వారి సంస్కారహీనతకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ?ప్రజా?సంక్షేమాన్ని విస్మరించి, కేవలం రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యత ఇస్తే చూస్తూ ఊరుకోబోమని, త్వరలోనే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరుశురాంపల్లి సర్పంచ్ ఉడుత సాంబయ్య, బీఆర్ఎస్ నాయకులు పోలసాని లక్ష్మీ నరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, తోట శ్రీనివాస్, పాల్గొన్నారు.

## ఘనంగా శివ స్వాముల పడి పూజ్య కార్యక్రమం



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ పోచమ్మ గుడి వద్ద వినోద్ స్వామి నివాసంలో శివ స్వాముల పడి పూజ ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణాల మధ్య శివుడికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ పూజ, సంకల్పం నిర్వహించి అనంతరం శివలింగానికి పంచామృత అభిషేకం, జలాభిషేకం చేశారు. శివ స్వాములు భక్తి శ్రద్ధల తో భజన కార్యక్రమం నిర్వహించారు. శివ భక్తులు చేపట్టిన భజనలు, కీర్తనలు తో వినోద్ స్వామి నివాసం శివనామ స్మరణం తో మారుమోగింది పూజ అనంతరం 12 మెట్లు వెలిగించి శరణు ఘోష పాడారు. భజనానంతరం శివ స్వాములకు పూజా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల శివ స్వాములు, జహీరాబాద్ వివిధ ప్రాంతంలో చెందిన శివ స్వాములు పాల్గొన్నారు.

## పద్మ నగర్ గ్రామంలో ఖాళీగా ఉన్న భవనాన్ని.




- VO అప్పగించిన పాలకవర్గం

**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం పద్మ నగర్ గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం మహిళ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో పద్నాలుగు గ్రామపంచాయతీ పాలకవర్గానికి కలిసి మహిళా పొదుపు సంఘాల వారు. తమకు ప్రతినెల ఒకసారి పొదుపు సంఘాల ఆధ్వర్యంలో. మీటింగ్లు. తదితర అవసరాలకు మహిళ గ్రూప్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బందికరంగా ఉందని గ్రామపంచాయతీ పాలకవర్గానికి తెలపడంతో గ్రామ సర్పంచ్ పాలకవర్గం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఖాళీగా ఉన్న భవనాన్ని మహిళా గ్రూపు సంఘాలకు ఇవ్వవలసిందిగా తెలియజేయడంతో ఈరోజు గ్రామసభ లో. పద్మ నగర్ లో ఖాళీగా ఉన్న భవనాన్ని మహిళా. ఖా.అందించిన పాలకవర్గం. ఇందుకుగాను మహిళ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## కెమిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మోతే తిరుపతి




**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం చెల్పూర్ కెమిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గా ఎన్నికైన కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉద్యోగి మోతె తిరుపతి మాట్లాడుతూ నాతో పాటుగా విజయం సాధించినప్రభాకర్ జనరల్ సెక్రటరీ, కెటిపిఎస్, రవీందర్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ వైటిపిఎస్, సుప్రియ ఆర్గనైసింగ్ల సెక్రటరీ కెటిపిపి, లకు హృదయ పూర్వక అభినందనలు. ఎలక్షన్ ప్రక్రియను విజయ వంతంగా పూర్తి చేసిన క్రిష్ణ చీఫ్ కెమిస్ట్, రాజయ్య సీనియర్ కెమిస్ట్ కెటిపిపి గార్లకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. గిరిధర్ చీఫ్ కెమిస్ట్ (మాజీ ప్రెసిడెంట్) గెలిచినా అభ్యర్థులకు అభినందనలు తెలియ జేశారు. అదేవిధంగా గెలుపు ఓటములు సహజం. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా మనం అందరం ఒక్కటి. మనలో ఎలాంటి బేదాభిప్రాయాలకు తావు లేకుండా మన అసోసియేషన్ అభివృద్ధి పరంగా కలిసి కట్టుగా ముందుకు సాగుదాం అని తెలిపారు

## కోటగుళ్ళు శివరాత్రి మహోత్సవాలకు సహాయ సహకారాలు అందజేస్తాం



- క్యాంపు కార్యాలయంలో శివరాత్రి మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో ఈనెల 15 ఆదివారం నిర్వహించే శివరాత్రి మహోత్సవాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమ గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15, 16 ,17 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి , గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, చెల్పూర్ సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, రాజ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేపాక రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటెమియా, లింగంపల్లి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకెళ్తున్న 7వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి బండారి రవీందర్...



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో బిఆర్ఎస్, సిపిఐ పార్టీ కలిసి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి బండారి రవీందర్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదని పాలనను గాలికి వదిలేసిందని ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. క్యాతన్ పల్లి,సాయి కుటీర్,దుబ్బపల్లి ఏరియాలలో ప్రజలను కలుస్తూ గడపగడప తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఓటర్లు సైతం బ్రహ్మరథం పట్టడంతో గెలుపు దిశగా పయనిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఐ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి-సంక్షేమ పనులను వివరించిన బీఆర్ఎస్ నాయకులు



**జహీరాబాద్, నేటిధాత్రి:** జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఝరాసంగం మండల తుమ్మనపల్లి గ్రామ నూతన సర్పంచ్ నాజియా అంజూమ్ షైక్ సోహైల్ జహీరాబాద్ పట్టణంలోని 13 వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జఫ్ఫార్ గారికి మద్దతుగా జరిగిన వారి వార్డులలో జరిగిన అభివృద్ధి పనులను, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు 13వ వార్డు బిఆర్ఎస్ పార్టీలో చేరిన వార్డు ఇంచార్జ్ నాజియా అంజూమ్ షైక్ సోహైల్ ఆధ్వర్యంలో చేరడం జరిగింది,

## చట్టవ్యవస్థ పరిస్థితుల పై వివరాలు తెలుసుకున్నారు



**గుండాల, నేటిధాత్రి:** ఓఎస్ డి గుండాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, మల్కానా, స్టేషన్ డైరీ, పెండింగ్ కేసులు మరియు స్టేషన్ నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై వారి పనితీరును తెలుసుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనీ సూచనలు చేశారు. ముఖ్యంగా కేసుల వేగవంతమైన దర్యాప్తు, స్టేషన్ శుభ్రత, రికార్డుల సరైన నిర్వహణ, మరియు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆదేశించారు. ఎక్సమిస్ట్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారుస్టేషన్‌లో అందుబాటులో ఉన్న సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు సిబ్బంది హాజరు పరిస్థితిని కూడా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న చట్టవ్యవస్థ పరిస్థితులపై వివరాలు తీసుకుని అవసరమైన సూచనలు అందించారు. గుండాల ఎస్ఐ సైదా రహూఫ్, సీఐ తిరుపతి ,స్టేషన్ సిబ్బంది హాజరై ఓఎస్డి కి అవసరమైన సమాచారం అందించారు.

# రాయికోడ్ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం



జహీరాబాద్, నేటిధాత్రి: రాయికోడ్: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం లో ఇటీవల మండల నూతన ప్రెస్ క్లబ్ ను ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షులు నదర రమేష్, ఉపాధ్యక్షులు సాయిరాం శెట్కార్, ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు రాయికోడ్ లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ కమిటీ కార్యాలయం లో వైస్ సతీష్ కుమార్ (ప్రభాకర్ రావు )వైస్ ఛైర్మన్ భీమన్న లు ప్రెస్ క్లబ్ నూతన నాయకులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు అక్షింతలు వేసి ఆశీర్వచనం చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, నాయకులు బి. సంగమేశ్వర్ పాటిల్ తదితరులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి లో జర్నలిస్టు నాయకులు మరింత భాగస్వాములై తమ వృత్తిని కొనసాగించాలన్నారు. త్వరలో నిర్వహించే జాతర ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాల కవరేజ్, ఆలయ అభివృద్ధి కి తమ సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులకు,నాయకులకు, అర్చకులకు, సిబ్బందికి నూతన ప్రెస్ క్లబ్ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం లో ధర్మకర్తల మండలి సభ్యులు బసంత, వీరయ్య స్వామి, నాయకులు, అర్చకులు, సిబ్బంది సంగమేశ్వర్ పాటిల్, డాక్టర్ వెంకటేశం, సంగన్న,ఇందూరి కృష్ణ,సందీప్ స్వామి, బస్వరాజ్ స్వామి, మఠం బస్వరాజ్ స్వామి తదితరులు ఉన్నారు.

# 13వ వార్డు అభ్యర్థి బొచ్చు మాధవి లత ప్రచారం



పరకాల,నేటిధాత్రి: మున్సిపాలిటీలోని 13వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొచ్చు మాధవిలత విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వార్డు పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను కలిసి ఆశీర్వాదం కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఎల్లప్పుడూ ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతామని తాగునీరు,డ్రైనేజీ,రోడ్లు,వీధి దీపాల సమస్యలు లేకుండా ప్రత్యేక దృష్టి సారిస్తా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూనే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదరించండి అమ్మ గార్డెన్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా...

▸▸9వ వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి భీమా మల్లేష్



రామకృష్ణాపూర్, నేటిధాత్రి: ప్రజలంతా ఒక్కసారి ఆదరించి, ఓటు వేసి గెలిపిస్తే అమ్మ గార్డెన్ ఏరియాను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి భీమా మల్లేష్ అంటున్నారు. మునిసిపాలిటీ ఎన్నికల్లో భాగంగా అమ్మ గార్డెన్ ఏరియాలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి భీమా మల్లేష్ గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళా, ఆదరించి గెలిపిస్తే కాలనీని మరింత అభివృద్ధి చేస్తానని ఓటర్లకు తెలియచేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ప్రచార కార్యక్రమంలో కొంపెల్లి సమ్మయ్య, మెట్ల సుధాకర్, చంద్రగిరి ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వనజ రాజేష్ ను ఆశీర్వదించండి



భూపాలపల్లి, నేటిధాత్రి: మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా టీబీ కౌటర్స్ కారల్ మాక్స్ కాలనీ లో గొడుగు వనజ రాజేష్ స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రెండు సార్లు పోటీ చేసి కౌన్సిలర్ గా ఓడిపోయాను కావున కాలనీ ప్రజలు అందరూ ఆలోచించి ఈసారి నన్ను మున్సిపాలిటీ కౌన్సిలర్ గా బ్యాట్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి అని ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేస్తున్నాను అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రడం శ్రీను ప్రచారంలో ముందంజ

▸▸కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్టే.

▸▸మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి





కేసముద్రం, నేటిధాత్రి: కేసముద్రం మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 7 వ వార్డు అభ్యర్థి రడం శ్రీను ప్రచారంలో దూసుకుపోతున్నారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరిస్తూ తాను గెలిస్తే ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ అందిస్తానని మరియు కేసముద్రం మున్సిపాలిటీ లో 7 వ వార్డు అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని తెలియజేశారు. కేసంద్రం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మరియు మాజీ చైర్మన్ నీలం సుహాసిని దుర్గేష్ విస్తృత ప్రచారంలో పాల్గొన్నారు. 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రడం శ్రీనుకి మీ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. మార్కెట్ చైర్మన్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు ఇందిరమ్మ ఇండ్లు మరియు పేదలకు సన్న బియ్యం గృహజ్యోతి మరియు ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ ప్రజల మనసు దోచుకున్న కాంగ్రెస్ పార్టీ నే గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచారంలో రడం శ్రీను, రడం నిఖిల్,గుండు గోపాల్, మాదాను సారంగం, కోలిపాక వెంకన్న, చిలుముల సదానంద చారి, బండి రమేష్, బండి తోట వెంకన్న, కొనతం కోటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి, నేటిధాత్రి: శుక్రవారం భూపాలపల్లి పట్టణం కేంద్రంలోని సుభాష్ కాలనీలో గల ఎలుగుల సురేష్ , ఎలుగుల చంద ఇరువురు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద ఉంటున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు నాణ్యమైన వైద్యం అందించుటకు నావంతు సహాయ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు దంపతులకు అండగా నిలిచిన మీడియా లోకం



▸▸యూనియన్లకు అతీతంగా జర్నలిస్ట్ నాయకుల ఏకగ్రీవ మద్దతు

▸▸సుత్తి కొడవలి నక్షత్రం' గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి

భూపాలపల్లి, నేటిధాత్రి: భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన సీనియర్ జర్నలిస్ట్ ఎర్రం అనూష సతీష్ కుమార్ విజయానికి జర్నలిస్టు లోకం ఏకమైంది. శుక్రవారం 27వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమెకు మద్దతుగా తోటి జర్నలిస్టులు పైలెట్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీలు, యూనియన్లకు అతీతంగా తరలివచ్చిన జర్నలిస్టులు.. తమ తోటి జర్నలిస్ట్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో పాల్గొన్న కాకతీయ ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ... ప్రజల సమస్యలను నిత్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులు నేడు నేరుగా ప్రజా సేవలోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. "అనూష సతీష్ కుమార్ గెలిపిస్తే, జర్నలిస్టులందరం కలిసి ఎమ్మెల్యే తో మాట్లాడి ప్రత్యేక నిధులు తీసుకువస్తాం. పైలెట్ కాలనీతో పాటు 27వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ఓటర్లకు భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న విద్యావంతురాలైన అనూష సతీష్ కుమార్ ను గెలిపించడం ద్వారా వార్డు రూపురేఖలు మార్చుకోవచ్చని వారు నినదించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు భాక్తం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్, జల్లి రమేష్, ఎడ్ల సంతోష్, అంబాల సంపత్, తడుక సుధాకర్, గజ్జ సారేశ్వరరావు, రవీందర్, ములకల లక్ష్మారెడ్డి, చెరుకు సుధాకర్, సమ్మయ్య, కడపాక రమేష్,కొంకుల సాంబయ్య, వెంకన్న,ప్రవీణ్, రజనీకాంత్, రాంబాబు,జగన్, పవన్, చంద్రమౌళి, సృజన్, సుమారు 50 మంది సీనియర్ జర్నలిస్టులుపాల్గొన్నారు.






# దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వినతిపత్రం ఇచ్చిన సర్పంచి సరిత



భూపాలపల్లి, నేటిధాత్రి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గోదావరి తీరాన వెలసిన మల్లన్న దేవుని ఆలయానికి నిధులు మంజూరు చేసి ఆలయ నిర్మాణం చేపట్టాలని మద్దులపల్లి సర్పంచి సరిత, ఉపసర్పంచి లచ్చిరెడ్డి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సానుకూలంగా స్పందించి దేవాదాయశాఖ డిఈ రమేష్ కు ఆలయానికి సంబంధించిన వివరాలు చూడాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచి సరిత తెలిపారు.

# కాంగ్రెస్ నేతల గుండా గిరి



▸▸పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమనిగిన రణరంగం

▸▸డీజే తగ్గించాలని కోరినందుకు

▸▸టీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి

▸▸గాయపడిన ఢిల్లీ పరమేశ్, మరో ఇద్దరు

▸▸కాంగ్రెస్ కార్యకర్తల గుద్దతో దాడి



మేడ్చల్, నేటిధాత్రి: కాంగ్రెస్ నేతలు గుండాగిరి చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై భౌతికదాడులకు తెగబడ్డారు. డీజే తగ్గించాలని కోరినందుకు దాడి చేయడమే కాకుండా నానా హంగామా సృష్టించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల తీరుతో అలియాబాద్ మున్సిపాలిటీ లాల్ గడి మలక్పేట్ లో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. "ఉల్టా చోర్ కొత్వాల్ను దాంటే" అన్నట్లు దాడి చేసింది కాంగ్రెస్ ఆందోళనకు దిగింది కూడా కాంగ్రెస్సే. లాల్ గడి మలక్పేట్ బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఎదుట బీఆర్ఎస్ నేతపై దాడి అనంతరం కాంగ్రెస్ నేతలు కయ్యానికి కాలు దువ్వడం, దానికి బదా నాయకులు తామేమీ తక్కువకాదు అన్నట్లు దాడికి రావడంతో ఒకవైపు దశలో ఏమి జరుగుతుందో తెలియనిగందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం లాల్ గడి మలక్ పేటలోని బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో బీఆర్ఎస్ అభ్యర్థులతో చర్చలు జరిపేందుకు వెళ్లారు. ఆ సమయంలోకాంగ్రెస్ కు చెందిన ప్రచార గీత వాహనం అటువైపుగా వచ్చింది. ఇద్దరు ఎమ్మెల్యేలు అక్కడ చూసిన కాంగ్రెస్ నాయకులు మరింత సౌండ్ పెంచారు. ఆ సౌండ్లో మాట్లాడుకోలేని పరిస్థితి ఏర్పడటంతో డీజే తగ్గించాలని బీఆర్ఎస్ కార్యకర్తలు కోరారు. అప్పటికి తగించి లోపలికి వెళ్లగానే సౌండ్ పెంచి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో అసహనానికి గురైన వారు డీజేని ఆపివేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు గుంపులు గుంపులుగా శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా డీసీసీ అధ్యక్షుడు జంగయ్య యాదవ్ కు సమాచారం ఇవ్వడంతో ఆయన 20, 30 కార్యకర్తలతో కలిసి దాడికి వచ్చారు. ఈ దాడిలో అల్వాల్ కు చెందిన బీఆర్ఎస్ నేత ఢిల్లీ పరమేశ్ తీవ్రంగా గాయపడ్డారు, ఆయనతో పాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి.ఎమ్మెల్యే మల్లారెడ్డి కారు అద్దాలను కూడా పగుల గొట్టారు. జయటకు రమ్మని అంటూ దౌర్జన్యం చేశారు. శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఎదుట కార్యకర్తలతో ఆందోళనకు దిగారు. ఆ తర్వాత నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు హరివర్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చారు. వారితో పాటు వచ్చిన పలువురుకార్యకర్తలు గేట్ ను కాలితో తన్నుతూ, తోస్తూ ప్రహరీ దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. జంగయ్య యాదవ్ మల్లారెడ్డిని దుర్భాషలాడుతూ బయటి రావాలని అరవడంతో కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు. కోడిగుడ్లు, నీళ్ల సీసాలను కూడా విసిరికొట్టారు. పోలీసులు ఎంత అదుపుచేసినా వినకుండా దూసుకెళ్లడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. సమాచారం అందుకు మేడ్చల్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శంకర్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు ఘటనా.. స్థలానికి చేరుకొని, పరిస్థితులను చక్కదిద్దారు.

# వార్డ్ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి



▸▸ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి మినుగు ముని

రామకృష్ణాపూర్, నేటిధాత్రి: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డ్ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్, సిపిఐ పార్టీలు బలపరిచిన సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థి మినుగు ముని అంటున్నారు. గద్దె రాగడి ఏరియాలోని కాలనీలలో గడపగడపకు ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు.ఎనిమిదవ వార్డు ప్రజలు అవకాశం ఇస్తే కాలనీలలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇస్తున్నారు. స్థానిక బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ అలుగుల శ్రీలత- సత్తయ్యలు సైతం కౌన్సిలర్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తుండటంతో గెలుపు లాంచనమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ప్రచార కార్యక్రమంలో మేరుగు రాజేశం, కుర్మ గురువయ్య, దినేష్, దేవి సాయి కృష్ణ, రాజ్ కుమార్, శ్రీనివాస్, వంశీ, రాజేందర్, సాంబయ్య, మనోహర్, రమేష్, మొండయ్య, హారీష్ లు పాల్గొన్నారు.

# 23వ వార్డ్ లో బీఎస్పీ అభ్యర్థి బోడపట్ల నర్సింగరావు జోరుగా ప్రచారం



▸▸అభివృద్ధి, ప్రజా సంక్షేమమే నా ప్రధాన అజెండా

▸▸ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి

▸▸వార్డు సమస్యలకు దశలవారీ పరిష్కారం

▸▸యువతకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి

▸▸ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి

పఠాన్‌చేరు, నేటిధాత్రి: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డ్ లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కౌన్సిలర్ అభ్యర్థిగా బోడపట్ల నర్సింగరావు ఎన్నికల ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. ఇంటింటి ప్రచారం, వీధివీధి సమావేశాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ఓటర్లకు చేరువవుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 23వ వార్డ్ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే తన రాజకీయ అజెండా అని స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇస్తూ, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. అలాగే వార్డులోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఉద్యోగాల రూపకల్పన, శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యంగా ఉంటూ, వార్డ్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే కౌన్సిలర్ గా పనిచేస్తానని భరోసా ఇస్తూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీకి చెందిన ఏనుగు గుర్తుపై ఓటు వేసి తనను 23వ వార్డ్ కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రతి ఒక్క ఓటరును పేరుపేరునా విజ్ఞప్తి చేశారు.

# కోహీర్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించిన నాయకులు



జహీరాబాద్, నేటిధాత్రి: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, సీనియర్ నాయకులు కలీమ్, యువ నాయకులు మిథున్ రాజ్ కోహీర్ పట్టణం లోని వివిధ వార్డ్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్ నాయకులు మాట్లాడుతూ ,ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారంటీలు ఎక్కడ అని నిలదీయాలన్నారు, బి ఆర్ ఎస్ హయాంలో చేసిన పనులకు రంగులు వేసి మేమే చేసామని అని గొప్పలు చెప్పుకుంటున్నారు,ప్రజల ఆశీస్సులతో కోహీర్ గడ్డ పై గులాబీ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులు,నాయకులు ,కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు..

# చిన్నారిని ఆశీర్వదించిన ఉపసర్పంచ్.



చిట్యాల, నేటిధాత్రి: భూపాలపల్లి జిల్లా లోని చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజకుమార్ -అనూష దంపతుల పుత్రిక అయిన హాన్సిక కుణ వేడుకకు హాజరై చిన్నారి ఆశీర్వదించిన బిజెపి చిట్యాల మండలాధ్యక్షుడు చిట్యాల ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి 9వ వార్డు సభ్యుడు మైదాన్ రాజ్యా- శ్రీకాంత్, వల్లాల ప్రవీణ్ గుండ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" "యూట్యూబ్ ఛానల్" కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**

"నేటిధాత్రి" 21వ వసంతపు తోరణం
చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "20 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను వింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "21 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు ముందుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....
21st ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం
మీ కట్టా శివ సుబ్రహ్మణ్యం సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా 8520007444
మీ కట్టా రాఘవేందర్ రావ్ సీఈఓ నేటిధాత్రి దినపత్రిక 9908658888, 8297779999

## విటమిన్ బి12 లోపిస్తే ఏయే ఆహారాలను తినాలి..?

మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీన్నే సయానో కోబాలమైన్ లేదా కోబాలమైన్ అని పిలుస్తారు. మన శరీరంలో అనేక జీవక్రియలను సరిగ్గా నిర్వహించడంలో విటమిన్ బి12 ముఖ్య పాత్ర పోషిస్తుంది. నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. డీఎన్ఏ సంశ్లేషణకు సహాయం చేస్తుంది. విటమిన్ బి12 లోపం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇవి కొందరిలో పలు లక్షణాలను కలగజేస్తాయి. విటమిన్ బి12 లోపం వల్ల కొందరిలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరిలో స్వల్ప లేదా తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ఒక్కొక్కరిలో వేర్వేరుగా ఉంటాయి. విటమిన్ బి12 లోపం వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

### ఎందుకు వస్తుంది..?

విటమిన్ బి12 మనకు అధికంగా మాంసం లేదా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. అందువల్ల మాంసాహారాల్లో ఈ సమస్య కనిపించడం అరుదు. శాకాహారుల్లో, కనీసం కోడిగుడ్లు తినని వారు లేదా పాలు తాగని వారు, పెరుగు, నెయ్యి వంటివి కూడా తినని వారిలో ఈ విటమిన్ లోపం ఏర్పడుతుంది. కొందరు మాంసాహారం తింటున్నా ఇతర పోషకాహారాలను తినకపోవడం వల్ల కూడా విటమిన్ బి12 లోపం ఏర్పడే అవకాశాలు ఉంటాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధి ఉంటే అలాంటి వారి శరీరం విటమిన్ బి12 ను సరిగ్గా శోషించుకోలేదు. దీంతో కూడా ఈ విటమిన్ లోపం ఏర్పడుంది. జీర్ణాశయ, పేగుల సమస్యలు ఉన్నా, శస్త్ర చికిత్సలు జరిగిన వారిలో, డయాబెటిస్ లేదా గ్యాస్ ట్రబుల్ మందులను వాడేవారిలో విటమిన్ బి12 లోపం వస్తుంది. విటమిన్ బి12 లోపం ఉంటే తీవ్రమైన నీరసం, అలసట ఉంటాయి. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు ఉంటుంది లేదా సూదుల్తో గుచ్చినట్లు ఉంటుంది.

### ఎవరికి ఎంత కావాలి..?

విటమిన్ బి12 లోపం ఉన్నవారిలో కొందరికి చర్మం పాలిపోయి లేదా పసుపు రంగులో కనిపిస్తుంది. నాలుక వాపులకు గురై ఎరుపు రంగులో దర్శనమిస్తుంది. ఆకలి అనిపించదు. ఏ ఆహారం తినాలనిపించదు. బరువు తగ్గుతారు. ఏ విషయంపై కూడా ధ్యాస పెట్టలేకపోతుంటారు. శ్వాస




తీసుకోవడంలో సమస్యగా అనిపిస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపిస్తాయి. కొందరు డిప్రెషన్ బారిన పడతారు. చిరాగ్గా అనిపిస్తుంది. ఇక రోజుకు ఎవరికి ఎంత మోతాదులో విటమిన్ బి12 అవసరం అవుతుందనే విషయానికి వస్తే 19 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు 2.4 మైక్రోగ్రాముల మేర విటమిన్ బి12 అవసరం. గర్భిణీలకు రోజుకు 2.6 మైక్రోగ్రాముల మేర ఈ విటమిన్ కావాలి. పాలిచ్చే తల్లులు రోజుకు 2.8 మైక్రోగ్రాముల విటమిన్ బి12ను తీసుకోవాల్సి ఉంటుంది. విటమిన్ బి12 లోపం ఉన్నవారికి వైద్యులు మందులను ఇస్తుంటారు. విటమిన్ బి12 ట్యాబ్లెట్లను డాక్టర్ సలహా మేరకు వేసుకుంటే ఈ లోపం తగ్గుతుంది. సాధారణంగా 500 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ట్యాబ్లెట్‌ను మింగితే అందులో శరీరం కేవలం 10 మైక్రోగ్రాముల విటమిన్ బి12 ను మాత్రమే శోషించుకుంటుంది.

### ఈ ఆహారాల్లో..

విటమిన్ బి12 మనకు ఎక్కువగా జంతు సంబంధ ఉత్పత్తుల్లో లభిస్తుంది. మటన్ లివర్, కిడ్నీలు, చేపలు, రొయ్యలు, పాలు, చీజ్, పెరుగు, కోడిగుడ్లు, చికెన్ వంటి ఆహారాలను తరచూ తింటుంటే విటమిన్ బి12ను పొందవచ్చు. పలు శాకాహారాల్లోనూ మనకు విటమిన్ బి12 స్వల్ప మోతాదులో లభిస్తుంది. ఫోర్టిఫైడ్ సిరియల్స్, సోయా పాలు, బాదం పాలు, న్యూట్రిషనల్ ఈస్ట్, పుట్టగొడుగులు వంటి శాకాహారాలను తినడం వల్ల కూడా విటమిన్ బి12 లభిస్తుంది. కానీ వీటిల్లో స్వల్ప మోతాదులో మాత్రమే ఈ విటమిన్ ఉంటుంది. ఇలా విటమిన్ బి12 ఉన్న ఆహారాలను రోజూ తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.

## రోజూ వీటిని తినండి..!

### కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు



ప్రస్తుత తరుణంలో అధిక కొలెస్ట్రాల్ సమస్య చాలా మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. శరీరంలో కొలెస్ట్రాల్ నిల్వలు పేరుకుపోవడం కారణంగా గుండె జబ్బులు కూడా వస్తున్నాయి. చిన్న వయస్సులో ఉన్నవారు కూడా గుండె పోటు బారిన పడి చనిపోతున్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నాయని తెలియడం లేదు. దీంతో ముప్పు ఏర్పడుతోంది. కనుక ప్రతి ఒక్కరు వయస్సుతో సంబంధం లేకుండా కనీసం ఏడాదికి ఒకసారి అయినా సరే లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు చేయించుకుని కొలెస్ట్రాల్ స్థాయిలను చెక్ చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చని, కొలెస్ట్రాల్ అధికంగా ఉంటే అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవచ్చని, దీంతో గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చని చెబుతున్నారు. అయితే కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు రోజూ వ్యాయామం చేయడంతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీంతో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### ఓట్స్..

కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఓట్స్ అద్భుతంగా పనిచేస్తాయి. వీటిల్లో బీటా గ్లూకాన్ ఉంటుంది. ఇది జెల్ లాంటి పదార్థం. కనుక ఓట్స్‌ను తిన్నప్పుడు ఇది మన శరీరంలో కొలెస్ట్రాల్‌కు అతుక్కుపోతుంది. అనంతరం వ్యర్థం రూపంలో బయటకు వస్తుంది. కనుక ఓట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. ఓట్స్‌ను కొందరు రోజూ ఉదయం పాలతో కలిపి తింటారు. లేదా ఓట్‌మీల్, ఉప్మా లాగా ఓట్స్‌ను తయారు చేసి తినవచ్చు. ఓట్స్ లాగే బార్లీ గింజలు కూడా మేలు చేస్తాయి. వీటిల్లోనూ బీటా గ్లూకాన్ ఉంటుంది. ఇది కూడా కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. బార్లీ గింజలను ఉడకబెట్టి తినవచ్చు. లేదా నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజూ తాగవచ్చు. దీంతో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. అలాగే బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలను తినడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఫైబర్, ప్లాంట్ స్టెరాల్స్ కూడా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. కనుక రోజూ వీటిని గుప్పెడు మోతాదులో నానబెట్టి తింటుంటే మేలు జరుగుతుంది.

### చేపలు..

చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల రక్త నాళాలు, గుండె కండరాల వాపులు తగ్గిపోతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. తరచూ చేపలను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. శనగలు, పప్పు దినుసులు, కిడ్నీ బీన్స్ వంటి వాటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని తింటే కొలెస్ట్రాల్‌ను శరీరం శోషించుకోకుండా చూస్తాయి. దీని వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ఈ పప్పు దినుసులను రోజూ కూరల్లో వేసి తినవచ్చు. లేదా నేరుగా ఉడకబెట్టి తినవచ్చు.

### పండ్లు..

అవకాడోలలో మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. యాపిల్ పండ్లు, బెర్రీలు, సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. బెండకాయలు, వంకాయలు వంటి కూరగాయలు కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక వీటిని కూడా తరచూ తినాలి. ఇలా పలు రకాల ఆహారాలను తరచూ తినడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు.

## ఇది.. పిచ్చి మొక్క అనుకుంటే పొరపాటు పడినట్లే..!

మన చుట్టూ పరిసరాల్లో అనేక రకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిల్లో ఔషధ గుణాలు ఉండే మొక్కలు చాలానే ఉన్నాయి. కానీ వాటి గురించి చాలా మందికి తెలియదు. వాటిని చూస్తే చాలా మంది పిచ్చి మొక్కలని అనుకుంటారు. అయితే అవి అందించే ప్రయోజనాల గురించి చాలా మందికి అవగాహన లేదు. ఇప్పుడు చెప్పబోయే మొక్క కూడా అలాంటిదే. అదే వాము మొక్క. చూసేందుకు ఇది పిచ్చి మొక్కలా ఉంటుంది. కానీ ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. అద్భుతమైన లాభాలను అందిస్తుంది. వాము మొక్క ఆకులు వాము వాసననే కలిగి ఉంటాయి. వీటిని నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వాము మొక్క పలు వ్యాధులను నయం చేస్తుందని వారు అంటున్నారు.

జీర్ణ, శ్వాసకోశ సమస్యలకు..

వాము మొక్క ఆకులు జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ ఆకుల్లో ఉండే పలు సమ్మేళనాలు మన జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌లను యాక్టివేట్ చేస్తాయి. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. వాము ఆకుల నీళ్లను తాగడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోవడంతోపాటు కడుపు నొప్పి తగ్గుతుంది. తీవ్రమైన గ్యాస్ సమస్య ఉన్నవారికి ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను తగ్గించడంలోనూ ఈ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. దగ్గు, జలుబు, ఇతర శ్వాస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారి గాలి సరిగ్గా లభిస్తుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం పొందవచ్చు. ఆస్తమా, బ్రాంకైటిస్ ఉన్నవారికి సైతం



మేలు జరుగుతుంది.

### రోగ నిరోధక శక్తికి..

వాము ఆకుల్లో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల వాము ఆకులను పేస్ట్‌లా చేసి చర్మంపై రాస్తుంటే చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. గజ్జి, తామర వంటి చర్మ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. వాము ఆకుల్లో ఉండే మినరల్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. చిన్నారులకు సైతం ఈ ఆకులు ఎంతో మేలు చేస్తాయి. వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. ఆరోగ్యం మెరుగు పడుతుంది.

వాము ఆకులను నోట్లో వేసుకుని నమిలితే ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఆకుల్లో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు నోట్లో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. వాము ఆకుల నీళ్లను తాగుతుంటే బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ ఆకుల నీళ్లను సేవిస్తే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. వాము ఆకులను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. లేదా ఈ ఆకుల జ్యూస్‌ను కాస్త తీసి దాన్ని కొద్దిగా తేనెతో కలిపి తీసుకోవచ్చు. చర్మంపై పూతగా ఉపయోగించవచ్చు. లేదా మీరు రోజూ చేసుకునే కూరల్లో, ఇతర వంటల్లోనూ వేయవచ్చు. ఇలా ఈ ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు.

## వర్షాకాలం.. ఈ కూరగాయలు తినే ముందు 100 సార్లు ఆలోచించండి..!



కూరగాయలు ప్రయోజనకరంగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎందుకంటే వాటిలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకుంటే, అనేక వ్యాధుల నుండి ఉపశమనం పొందుతారు. అయితే, వర్షాకాలంలో ఈ కూరగాయలు తినడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఏ కూరగాయల గురించి వారు హెచ్చరిస్తున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..

### కాలీఫ్లవర్

వర్షాకాలంలో కాలీఫ్లవర్ తినడం మంచిది కాదు, ఎందుకంటే తేమ కారణంగా బ్యాక్టీరియా, పురుగులు పెరిగే అవకాశం ఉంది. కాలీఫ్లవర్‌లో తేమ ఎక్కువగా ఉండటం వలన, అది త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. కడుపు ఇన్ఫెక్షన్లకు కూడా కారణం కావచ్చు.

### వంకాయ

వంకాయలలో కూడా టేప్‌వార్మ్ కనిపించే అవకాశం ఉంది. కోసేటప్పుడు పురుగులు కనిపిస్తే, మొత్తం వంకాయను పారవేయాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కొన్ని పురుగులు వంట తర్వాత కూడా జీవించగలవు, వీటిని తింటే ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది. దాని లార్వా మెదడులోకి ప్రవేశిస్తే, అది ప్రాణాంతక పరిణామాలను కలిగిస్తుంది.

### బీరకాయ

బీరకాయ వర్షాకాలంలో సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఫైబర్ పరంగా గొప్ప కూరగాయ. కానీ వర్షాకాలంలో ఇది కీటకాలతో ఉంటుంది. దానిలో ఉండే పురుగులు చాలా చిన్నవిగా ఉంటాయి. ఈ పురుగులను తింటే, అవి శరీరంలోకి ప్రవేశించి మెదడుకు చేరుతాయి. ఇవి ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి.

### క్యాబేజీ

క్యాబేజీ పొరల మధ్య టేప్‌వార్మ్‌లు దాక్కునే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు చాలా వేగంగా పెరుగుతాయి. వాటిని శుభ్రం చేసి సరిగ్గా ఉడికించకపోతే, వాటి గుడ్లు జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించి శరీరం లోపలికి, మెదడులోకి కూడా చేరుతాయి. మీరు తినాలని అనుకుంటే క్యాబేజీని ఉపయోగించే ముందు నీటిలో మరిగించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

### క్యాప్సికమ్

క్యాప్సికమ్ లోపలి భాగంలో టేప్‌వార్మ్‌లు ఉండవచ్చు. సరిగ్గా కడగకపోతే, టేప్‌వార్మ్ గుడ్లు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి.

## ఈ పువ్వు షుగర్ పేషెంట్లకు దివ్యౌషధం!

అరటిపండ్లు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనందరికీ తెలుసు. కానీ అరటి పువ్వు మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో మీకు తెలుసా? అవును. అరటి పువ్వు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇందులో ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, పొటాషియం, భాస్వరం, ఇనుము వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు, ఇది అనేక తీవ్రమైన వ్యాధుల నుండి దూరంగా ఉండటానికి సహాయపడుతుంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో దీనిని వివిధ వంటకాల రూపంలో తీసుకుంటారు. ఆయుర్వేదంలో దీనిని ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇన్ని ఉపయోగాలున్న ఈ పువ్వు ఎలాంటి ఆరోగ్య సమస్యలకు మంచిది? దీన్ని ఎందుకు తినాలో తెలుసుకోండి.

### డయాబెటిస్

టైప్ 2 డయాబెటిస్ రోగులకు అరటి పువ్వు ఒక దివ్య ఔషధం. ఇది చక్కెర స్థాయిలను తగ్గించి షుగర్ నియంత్రణకు సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారు ఈ పువ్వును క్రమం తప్పకుండా తినాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

### ఒత్తిడి, నిరాశ దూరం

అరటిపండ్లలో మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ-డిప్రెసెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి టెన్షన్ తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని



మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతే కాదు అవి భయాందోళనలు, నిరాశ ఎదుర్కోవడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. నెగెటివ్ ఆలోచనల నుండి మిమ్మల్ని దూరంగా ఉంచుతాయి.

### జీర్ణవ్యవస్థ సక్రియం

అరటి పువ్వు ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది కడుపు సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచేందుకు దోహదం చేస్తుంది. కడుపు నొప్పి, వాంతులు లేదా విరేచనాలు వంటి కడుపు సంబంధిత సమస్యలతో బాధపడుతుంటే.. అరటి పువ్వును క్రమం తప్పకుండా తినడం చాలా మంచిది.

### రక్తహీనత

ఇనుము అధికంగా ఉండే అరటి పువ్వు రక్తహీనతను నివారించడానికి ప్రభావవంతమైన ఔషధంగా పనిచేస్తుంది. అంతే కాదు, రక్తహీనతకు సంబంధించిన ఇన్ఫెక్షన్ల నుండి దూరంగా ఉండటానికి కూడా ఇది సహాయపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారు అరటి పువ్వును క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకుంటే మేలు.

(NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు నేటిధాత్రి బాధ్యత వహించదు.)

## మన పూర్వీకులు అరటి ఆకుల్లో ఎందుకు తినేవారో తెలుసా?



మన పూర్వీకుల్లో దాదాపు అందరూ అరటి ఆకుల్లోనే తినేవారు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో నేటికీ చాలా మంది అరటి ఆకులపైనే తినడానికి ఇష్టపడతారు. సాధారణంగా అయితే పండుగలు , శుభకార్యాలు, వివాహాలు, ఇతర ప్రత్యేక సందర్భాలలో అరటి ఆకుల్లో భోజనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది మన పూర్వీకుల నుండి వచ్చిన ఆచారం మాత్రమే కాదు, పర్యావరణానికి మేలు చేసే మంచి మార్గం కూడా. కానీ చాలా మందికి దీని ప్రయోజనాల గురించి తెలియదు. ఆయుర్వేదం ప్రకారం, అరటి ఆకులపై తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇంతకీ, అరటి ఆకుల్లో తింటే కలిగే లాభాలేంటి? ఎందుకు మంచిదో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

### రోగనిరోధక శక్తి పెరుగుదల

అరటి ఆకులలో పాలీఫెనాల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు, ఇతర సహజ పోషకాలు ఉంటాయి. ఇవి హానికరమైన బ్యాక్టీరియాను నిరోధిస్తాయి. వేడి ఆహారాన్ని అరటి ఆకులపై వడ్డించినపుడు.. ఆకులోని ఈ పోషకాలు తేలికగా ఆహారంతో కలిసిపోయి ప్రత్యేక రుచిని ఇవ్వడంతో పాటు శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుస్తాయి.

### ఆహార రుచిని పెంచుతుంది

మెత్తని అరటి ఆకుపై రుచికరమైన వేడి ఆహారాన్ని వడ్డించినప్పుడు ఒక ప్రత్యేకమైన సహజ వాసన వెలువడుతుంది. ఈ వాసన భోజనాన్ని మరింత రుచికరంగా చేస్తుంది.

### పర్యావరణ పరిరక్షణ

అరటి ఆకులు పూర్తిగా సహజమైనవి. నూరుశాతం భూమిలో కరిగిపోతాయి. వీటిని పారవేసిన తర్వాత సహజంగా కుళ్ళిపోయి నేలకు ఎరువుగా మారుతాయి. ప్లాస్టిక్ లేదా ఇతర పదార్థాల మాదిరిగా ఇవి పర్యావరణానికి ఏ విధంగానూ హాని కలిగించవు.

### వేడి ఆహారం

అరటి ఆకుల్లో వేడి వంటకాలను వడ్డించినపుడు చీలిపోవు. వాటిపై ఉన్న సహజ మైనపు పొర ఆహారం అంటుకోకుండా నిరోధిస్తుంది. అదనంగా, వేడి కారణంగా ఎటువంటి హానికరమైన రసాయనాలు ఉత్పత్తి కావు.

### జీర్ణక్రియకు మంచిది

అరటి ఆకుల్లో తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరుగుతుంది. ఆయుర్వేదం ప్రకారం, ఈ ఆచారం శరీరంలో సానుకూల శక్తిని, ఆరోగ్యాన్ని పెంచుతుంది.

అరటి ఆకుల్లో విటమిన్లు బి, సి, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. వీటిలో ప్రతిరోజూ భోజనం తినడం వల్ల మధుమేహం, అధిక బరువు, అజీర్ణం, ఆస్తమా వంటి సమస్యలు తొలగిపోతాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ పద్ధతి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు నేటిధాత్రి బాధ్యత వహించదు.)

# టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు

## శ్రీవారిని దర్శించుకున్నాక వేదాశీర్వచనం



తిరుమల, నేటిధాత్రి:
తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన.. రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం.. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ రవిచంద్ర నిర్వర్తించనున్నారు.



# రూ.36 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం

## శంకుస్థాపన చేసిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

విజయవాడ, నేటిధాత్రి:
29 హెల్త్ సెంటర్ల నిర్మాణానికి 9.35 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. జి.కొండూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కష్ణప్రసాదు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైలవరం నియోజకవర్గంలో పేదలకు వివిధ సంక్షేమ పథకాల నిమిత్తం రూ.429.60 కోట్లు చెల్లించినట్లు వివరించారు. అలాగే అభివృద్ధికి రూ.151.29 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ లేదా ఎల్.ఓ.సీ ల రూపేణా 12.94 కోట్ల రూపాయలు అందించామన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా సాగుతుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో సైతం ఆపన్నులకు అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పులి జాడ కోసం వెదుకులాట

●కెమెరా ట్రాప్స్.. థర్మల్ డ్రోన్‌లతో పరిశీలన ●నిడిగొండ వైపు వెళ్లినట్లు అధికారుల వెల్లడి



జనగామ , నేటిధాత్రి:
మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి బయలుదేరిన మగ పులి లింగాలఘణపురం మండలం కుందారం శివారుకు చేరుకున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. బుధవారం రాత్రి కుందారం శివారులో సంచరించినట్లు స్థానిక రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ వణ్యప్రాణుల సంరక్షణా విభాగానికి సమాచారాన్ని
చేరవేశారు. దీంతో గురువారం నాడు కుందారం చేరుకున్న అటవీశాఖాధికారులు పులి తిరిగిన ప్రదేశాన్ని పాదముద్రల (పగ్ మార్క్స్) ఆధారంగా పరిశీలించి పులి సంచరిస్తున్నట్లు నిర్ధారించారు.
వారం పదిరోజులుగా యాదాద్రిభువనగిరి, సిద్దిపేట జిల్లాలో సంచరించిన పులి.. తాజాగా రెండు రోజుల కిందట జనగామ జిల్లాలోకి ప్ర వేశించింది. మొదట బచ్చన్నపేట మండలంలోకి ప్రవేశించి తిరిగి యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు, శారాజీపేట మీదుగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం జీడికల్ నుంచి బుధవారం నాటికి కుందారం శివారులోకి ప్రవేశించింది. అప్పటికే పగ్‌మార్క్స్ ద్వారా పులి ట్రాకర్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కచ్చితమైన కదలికలను తెలుసుకునేందుకు కెమెరా ట్రాప్స్, థర్మల్ డ్రోన్స్‌తో అన్వేషిస్తుండటం గమనార్హం. కాగా, పులి సంచారం నేపథ్యంలో జిల్లా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పులి ఎక్కడి నుంచి ఎటు వైపు వెళ్తుందో అర్థంకాక బావుల వద్ద ఉన్న డెయిరీ ఫామ్‌లు, పాడిగేదెలతో పాటుగా ఇతర ప శువులను కాపాడుకునేందుకు రైతులు కంటిమీద కును కు లేకుండా అష్టకష్టాలు పడుతున్నారు. అయితే కుందారం మీదుగా రఘునాథపల్లి మండలం నిడిగొండ వైపుకు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల్‌రెడ్డి నిర్ధారించారు. మరోవైపు పులికి ఎలాంటి హాని కలగకుండా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోకుండా సురక్షితంగా పులిని బంధించేందుకు అటవీశాఖాధికారులు శ్రమిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా నిడిగొండ, శ్రీమన్నారాయణపురం, బానాజీపేట, రఘునాథపల్లి, కన్నాయిపల్లి, గబ్బెట గ్రామాల్లో టాంటాం వేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సయ్యద్ ఇజాజ్ అహ్మద్, రమేశ్, లింగాలఘణపురం బీట్ ఆఫీసర్ రమేశ్, సెక్షన్ ఆఫీసర్ శోభారాణితో పాటుగా టైగర్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

# మద్రాస్ హైకోర్టులో నటుడు విజయ్‌కు చుక్కెదురు

## ఆదాయపన్ను శాఖ జరిమానాపై పిటిషన్ కొట్టివేత



చెన్నై, నేటిధాత్రి:
మద్రాసు హైకోర్టులో నటుడు, టీవీకే అధినేత విజయ్ కు చుక్కెదురైంది. ఆదాయపన్ను శాఖ విధించిన పెనాల్టీకి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించగా.. విచారించిన న్యాయస్థానం విజయ్ పిటిషన్‌ను కొట్టేసింది. 2015–16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ రూ.1.50 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది. దీనిపై 2022లో విజయ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెలలో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు.. ఇప్పుడు పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2015–16 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆదాయపన్ను రిటర్ను దాఖలు చేసినప్పుడు ఆ ఏడాది విజయ్ రూ.35 కోట్లు ఆదాయం పొందినట్లు ఆదాయ పన్ను శాఖ మద్రాసు హైకోర్టులో నివేదిక దాఖలు చేసింది. అందుకు సంబంధించి మదింపు చేపట్టిన ఆదాయపన్ను శాఖ విజయ్ ఇంట్లో జరిపిన సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలను సరిచూడగా 'పులి' సినిమాకు తీసుకున్న రూ.15 కోట్ల ఆదాయాన్ని లెక్కల్లో
చూపలేదని తేలింది. ఆ ఆదాయాన్ని దాచినందుకు రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఆదాయపన్ను శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ విజయ్.. మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.
విజయ్ నటించిన కొత్త సినిమా 'జన నాయగన్' వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనే ఉత్కంఠ ఇంకా వీడలేదు. ఈ క్రమంలో పన్ను జరిమానా కేసులో విజయ్ రిట్ పిటిషన్‌ను మద్రాస్ హై కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2015 సెప్టెంబర్ 30న ఐటి అధికారులు నిర్వహించిన సోదాలను అనుసరించి మాత్రమే నటుడు విజయ్ పన్నులు చెల్లించారని, అంతకు ముందు వచ్చిన ఆదాయానికి సంబంధించి కాదని, ఐటి శాఖ విధించిన జరిమానాను రద్దుచేయలేమని జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి తీర్పునిచ్చారు. ఆదాయపన్ను చట్టం ప్రకారం నిర్దేశించిన కాల పరిమితిలోపు జరిమానా ఉత్తర్వు జారీ చేయబడిందని ఆయన తేల్చారు. 015–16 ఆర్థిక సంవత్సరంలో అదనపు ఆదాయాన్ని స్వచ్ఛందంగా వెల్లడించినందుకు ఆదాయ పన్ను శాఖ తనకు రూ.1.50కోట్ల జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ 2022లో నటుడు విజయ్ రిట్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2015లో వచ్చిన పులి సినిమా నిర్మాతలు, ఎస్‌కెటి స్టూడియోస్‌కు చెందిన పి.టి.సెల్వకుమార్, శిబు చెక్కుల ద్వారా రూ.16కోట్ల పారితోషకంతో పాటు రూ.4.93 కోట్ల నగదును చెల్లించారని, చెక్కు మొత్తానికి మాత్రమే పన్ను మినహాయింపు (టిడిఎస్) జమ చేశారని, నగదు లావాదేవీకి కాదని ఐటి శాఖ పేర్కొంది.

# పటాన్‌చెరులో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక



సంగారెడ్డి, నేటిధాత్రి:
మున్సిపల్ ఎన్నికల వేళ పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీలు దేవానందం, యాదగిరి యాదవ్, వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ లతో పాటు 500 మంది కార్యకర్తలు మాజీ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్‌ఎస్ క్లీన్ స్వీప్ చేస్తుందని ఆయన ఆశాభవం వ్యక్తం చేశారు.

# ప్రజలే మిమ్ములను వద్దనుకున్నారు


●ఇప్పుడు న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటారా
●ప్రశాంత్ కిశోర్‌కు చీఫ్ జస్టిస్ చురకలు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. గతేడాది బిహార్‌లో జరిగిన ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ సందర్భంగా ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చురకలంటించారు. ఇప్పుడు ఈ న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 238 స్థానాల్లో పోటీకి దిగిన ప్రశాంత్ కిశోర్ పార్టీ.. ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయింది. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, గెలిచిన కూటమి సభ్యులు ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి.. ఒక్కో మహిళకు రూ.10వేలు పంపిణీ చేశారని జన్ సురాజ్ పార్టీ పిటిషన్‌లో ఆరోపించింది. ఈ క్రమంలో కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాలని ఆ పార్టీ కోరింది. అయితే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది.
ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'మేము ఇలాంటి నోటీసులు జారీ చేయలేం. ఎన్నికల్లో ఓడిపోయారు కాబట్టి.. మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారు. ఇలాంటి అంశాలపై రాజకీయ పార్టీలు కాకుండా.. సామాన్యులు కోర్టుకు రావడాన్ని మేం స్వాగతిస్తాం. ఒకవేళ.. మీ పార్టీ అధికారంలోకి వచ్చినా మీరూ అదే చేస్తారు' అని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమైనా ఫిర్యాదులు ఉంటే బిహార్ హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది.

# రెపోరేట్‌లో కానరాని మార్పులు

## యధాతథంగా ద్రవ్యపరపతి విధానం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా




ముంబై, నేటిధాత్రి:
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు శుక్రవారం ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బ్జడెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4 శాతం, రెండో త్రైమాసికంలో 4.2 శాతం ద్రవ్యోల్బణం నమోదు కావచ్చని అర్బీఐ అంచనా వేసింది. కాగా జనవరి చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు 723.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వ్యవస్థలో ద్రవ్య లభ్యత రోజువారీ సగటున రూ.75 వేల కోట్లుగా ఉంది.

# బానిస భావజాలంలో విమర్శల జోరు !



డెస్క్, నేటిధాత్రి:
గతంలో వికీ లీక్స్ కూడా ఓ ఊపు ఊపింది. విదేశాల్లో ఉన్న ఊరూపేరు లేని కొందరు పనిగట్టుకుని ప్రపంచ దేశాల్లో ఉన్నవారిపై ఊకదంపుడు, ఊహాగాన కథనాలు రాస్తుంటారు. అవన్నీ పట్టుకుని మనదేశంలో నోరు పెద్దదిచేసి అరవడం కొందరు అలవాటు చేసుకున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ పైనా దుమారం రేపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధాని పేరు పదేపదే ప్రస్తావన కు వచ్చిందని చెబుతున్న వారు అందులో ఏముందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. ఇదంతే ఒక ఎత్తయితే దీని కారణంగానే మోడీ అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారన్న ప్రచారం చేపట్టారు. దీంట్లో రాహుల్, లెఫ్ట్ పార్టీలు ముందున్నాయి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ లో రాహుల్ పేరు కూడా ఉంది. దానిని ఆయనగాని, ఆయనకు వంతపాడుతున్న వారు గానీ మాట్లాడడం లేదు. అందులో రాహుల్‌ను ఓ అసమర్థ నేతగా వర్ణించారు. అతను రాజకీయాలకు పనికి రాడని, అతని వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చారు. దీనిని మరుగున పర్చి మాట్లాడుతున్నారు. కనీసం రాహుల్ కూడా దీనిని తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. అలాగే రాహుల్ భారత రాజకీయాల గురించి ఎప్‌స్టీన్ ఎవడు కామెంట్ చేయడానికి అన్న ప్రశ్న వేసుకోవాలి. అలాగే మిగతా వారి గురించి కూడా అతను వ్యాఖ్యానించడానికి అతని తాహతు ఏంటన్నది కూడా ముఖ్యం. ఇక ట్రేడ్ డీల్ గురించి మాట్లాడుకుంటే ట్రంప్ ఏనాడూ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించ లేదు. 50శాతం సుంకాలు బాది చెవి మెలిపెట్టాడు. మాట్లాడడానికి కూడా భారత్ ప్రధానితో ఇష్టపడలేదు. అనూహ్యంగా ఆయన మారడానికి, ట్రేడ్ డీల్ కుదుర్చుకోవాలని అనుకోవడానికి కారణాలు ఉన్నాయి. ఒకటి అమెరికాలో భారత్‌కు మద్దతుగా అక్కడి నేతలు ట్రంప్‌పై అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. భారత్‌తో వాణిజ్యం తెంపుకుంటే మనం మఠాష్ అవుతామని అంటున్నారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో భారత్ ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంతో ట్రంప్‌కు దిక్కుతోచకుండా పోయింది. అలాంటి ట్రంప్ టారిఫ్‌లను 18శాతానికి తగ్గించి భారత్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. ఇక్కడ మోడీ ఎక్కడ ట్రంప్‌కు లొంగిపోయాడో, ఎక్కడ భారత్‌ను తాకట్టు పెట్టారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలి. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా డీల్ కుదుర్చుకునేదే. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారికి దేశాం గురించి, ప్రపంచం గురించి తెలియదనుకోవాలి. రాహుల్ లాంటి విపక్ష నేత ఉన్నందుకు సిగ్గుపడాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో గట్టిగా వాణి వినిపించలేకపోవడం, అల్లరి చేసి బయటకు రావడం మాత్రమే తెలిసిన అసమర్థుడు రాహుల్. ఇలాంటి వారి వల్లనే దేశ ప్రతిష్టకు మచ్చగా మారుతోంది. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఎంతవరకైనా వెళ్తుందని ట్రేడ్ డీల్ గురించి పదేపదే చెబుతున్న వారు సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేకరకాలుగా అందిరి పేర్లు ఉన్నాయి. వాటికి ఆధారాలు లేవు. ఓ వికృత వ్యక్తి, వ్యవభిచారి తనకు తానుగా రాసుకున్న కథలను చూపించి అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా భారత విపక్షాలు ఈ విషయంలో ముందున్నారు. ఏ సందు దొరికినా మోడీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నిజానికి పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించి పోరాడాలన్న పట్టుదల లేని వారంతా ఎంపిలుగా ఉన్నారు. ప్రజల డబ్బును దోచేస్తున్నారు. పన్నుల రూపంలో కట్టిన డబ్బులను దుబారా చేస్తున్నారు. ఇవన్నీ మాట్లాడడానికి సమయం ఉండదు. ఇకపోతే ఎప్‌స్టీన్ లైంగిక నేరస్తుడిగా అంగీకరించి 18 నెలలపాటు జైలు శిక్షకు గురై, ప్రైవేట్ జెట్స్, ఐలాండ్స్ కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ప్రపంచ నేతలతో, కార్పొరేట్లతో సంబంధాలు నెరిపే బ్రోకర్. 2019లో రెండోసారి జైలుకు వెళ్లిన తరువాత ఆత్మహత్య చేసుకున్నాడని అమెరికా ప్రకటించింది. అయితే తమ సంబంధాలు బయటకు వస్తాయని ప్రముఖులే హత్య చేయించారన్నది అక్కడి మీడియా కథనం. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకుతాను రాసుకున్న వారి పేర్లలో మోడీ, రాహుల్, కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ పేర్లు ఉన్నాయని సమాచారం. మరి వీరందిరికి సంబంధించి అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆ సందర్భంగా జరిపిన ఇ మెయిల్స్‌లో పదేపదే ప్రధాని పేరు ప్రస్తావనకు రావడం తదితర అంశాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే అంటూ చిలకపలుకులు పలుకుతున్న వారికి రాజకీయ నిబద్ధత లేదనుకోవాలి. 2014 జూన్ నుంచి 2017 మే మధ్య ఎప్‌స్టీన్‌తో అనేకసార్లు మెయిల్స్, చాట్స్ చేయడంతోపాటు మూడుసార్లు స్వయంగా కలిశారు. టెక్నాలజీ అభివృద్ధి కోసం, ఆ రంగంలో ప్రముఖులతో సంబంధాల కోసమే సంప్రదించానని, అతను నేరస్తుడని తెలీదని పురి చెబుతున్నారు. అప్పటికే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన క్రిమినల్ గురించి ఐఎఫ్ఎస్ మాజీ అధికారికి తెలియదనడం బుకాయింపున అంటున్నారు. అయితే అందులో బిల్‌గేట్స్, ట్రంప్, క్లింటన్, హిల్లరీ క్లింటన్ ఇలా ఎందరో ప ఏర్లు ఉన్నాయి. అప్పట్లో ఏదో సందర్భంలో అతనిని కలిసే ఉంటారు. అంతమాత్రాన అతనో సచ్ఛీలుడిగా, అతనికి పెద్ద హోదా ఆపాదించి మనలను మనం చిన్న చేసుకోవడం దారుణం. 2017 జులైలో ప్రధాని మోడీ ఇజ్రాయిల్‌లో పర్యటించడం మినహా మిగతాదంతా అబద్ధమని, ఆ నేరస్తుడి కల్పనలని పేర్కొంటూ కేంద్రం ఖండించింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఇ మెయిల్స్‌కు సంబంధించిన అంతర్జాతీయ కథనాలపై స్పందించడం సరికాదు. ఎవరికి వారు ఏదో ఊహించుకుని ఎప్‌స్టీన్‌ను ఆకాశానికి ఎత్తడం, అతనో దేవదూతగా భావించడం దుర్మార్గం. ఒక లైంగిక వ్యభిచారి అయిన ఎప్‌స్టీన్ గురించి తెలుసుకుంటే మంచిది. ట్రంప్, బిల్ క్లింటన్ మొదలు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రముఖుల చీకటి కోణాలను వెలుగులోకి వచ్చాయని అనుకోవడం కూడా అంతే పొరపాటు. ఇలాంటి కథనాలను వండివార్చే లెఫ్ట్ నేతలు దేశం గురించి ఆలోచిస్తే మంచిది. ముందుగా రాహుల్ పేరు ఎందుకు ప్రస్తావనకు వచ్చిందో నిలదీస్తే మంచిది. మోడీని నిందించాలనుకుంటే పార్లమెంటులో నిలదీయండి. అతని నిర్ణయాలను తిప్పికొట్టండి. పార్లమెంటులో మాట్లాడడం చేతకాని నేతలంతా జెఫ్రీ ఎప్‌స్టీన్ అనే ఓ వ్యభిచారి కథనాలకు ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా అతను ఈ భూమ్మీద లేడు కనక వివరాలు ఇవ్వలేడు కనుక బురదజల్లడం సరికాదు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..



హైదరాబాద్, నేటిధాత్రి:
ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణీత కాలంలో నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ మూడు వారాల గడువునిచ్చింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా.. అనర్హత అంశాన్ని తేల్చాలని ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత విచారణ తర్వాత జరిగిన పరిణామాలను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.
ఒక ఎమ్మెల్యే అనర్హత పిటిషన్ విచారణ జరిగిందని, ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేల విచారణ జరుగుతుందని అభిషేక్ సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గడువు పొడిగించాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ధర్మాసనం.. మూడు వారాల సమయాన్ని ఇచ్చింది. నిర్ణీత గడువు తర్వాత కూడా స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించకపోతే, కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. అనంతరం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# గడ్చిరోలిలో మరోమారు కాల్పులు

## ముగ్గురు మావోయిస్టుల మృతి



రాయపూర్, నేటిధాత్రి:
మహారాష్ట్ర – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే-47, స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు. ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999